VISALAANDHRA VIJAYAWADA Phone No. 378

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టరు నెం A 193

# విశాలాంధ్ర

705793

సంపుటి 6 ★ విజయవాడ బుధవారం ఆశ్వయుజం 10-1879 [అక్టోబరు 2-1957] ★ సంచిక 181

### కర్నూలులో బ్యాంకు ఉద్యోగుల సమ్మె
### బెంగాల్ సమ్మెకు సానుభూతిగా

కర్నూలు, అక్టోబరు 1

బెంగాల్ బ్యాంకు ఉద్యోగుల సమ్మెపట్ల సానుభూతి సూచకంగా కర్నూలులోని బ్యాంకు ఉద్యోగులందరు [illegible] నిరాహారదీక్ష చేశారు. [illegible] బ్యాంకుల ఎదుట ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేశారు.

### రాష్ట్ర రవాణామంత్రుల సమావేశం
### అక్టోబరు ఆఖరువారం ముస్సోరీలో

న్యూఢిల్లీ, అక్టోబరు 1

రాష్ట్ర రవాణా మంత్రుల సమావేశం అక్టోబరు ఆఖరు వారంలో ముస్సోరీలో జరుగుతుంది. ఈ సమావేశానికి కేంద్ర రవాణా మంత్రి శ్రీ లాల్ బహాదుర్ శాస్త్రి అధ్యక్షత వహింపగలరు.

# ఆయుధాలకై అమెరికా ఇస్తానన్న అప్పుకు భారతదేశ తిరస్కృతి

## న్యూయార్కు టెలివిజన్ గోష్టిలో శ్రీ కృష్ణమీనన్ ఉద్ఘాటన

### విదేశీ ఆర్థికసహాయం అవసరమే, కాని అది లభించనంతమాత్రాన ప్రమాదంలేదనివివరణ

న్యూయార్కు, సెప్టెంబరు 30

"ద్వితీయ పంచవర్ష ప్రణాళికకు విదేశీ ఆర్థిక సహాయం చాలా అవసరమైనమాట నిజం. అయితే ఆ సహాయం లభించకపోయినంత మాత్రాన ఏదో ప్రమాదం జరుగుతుందని నేను భావించను" అని కేంద్రరక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ నేడిక్కడ టెలివిజన్ ఇంటర్వ్యూలో అమెరికా విద్యార్థులు వేసిన ప్రశ్నలకు సమాధాన మిస్తూ చెప్పారు.

ఇద్దరు విద్యార్థులు, ఇద్దరు విద్యార్థినులు ప్రశ్నలు వేయగా, వాటికి శ్రీ కృష్ణమీనన్ జవాబు లిచ్చారు.

"ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించు కొంటున్నప్పుడు మేము కొన్ని యిబ్బందులు ఎదుర్కోక తప్పదు. అందులోను చాలా త్వరగా ఆర్థికాభివృద్ధిని సాధించాలని తలపెట్టినప్పుడు మరిన్ని యిబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన భారీ యంత్రాలను మేము విదేశాల నుంచి కొనుక్కోవాలి. అందుచేత విదేశీ సహాయం అవసరం కదా అని మీరు ప్రశ్నిస్తే, అవసరం పెద్దగానే వుందని సమాధాన మిస్తాను. అయితే, విదేశీ సహాయం లభించకపోతే కొంప లంటుకు పోతా యని మాత్రం నేను చెప్పను."

భారతదేశం అమెరికానుంచి పొందగోరుతున్న అప్పులో ఎంతభాగం పాకిస్తాన్ పై దాడి సాగించటానికి జరిపే సన్నాహాలకు వినియోగించబోతున్నారని అమెరికన్ విద్యార్థులు ప్రశ్నించగా, శ్రీ మీనన్ ఇలా సమాధాన మిచ్చారు.

ఆర్థికసహాయం చేయమని మేము ఇంతవరకు అధికారరీత్యా అమెరికాను అర్థించలేదని ముందుగామీకు స్పష్టం చేయదలచుకొన్నాను. మాకు ఉన్న అవసరాలు ఏమిటో బాహాటంగానే ప్రకటించాం. ఆర్థికాభివృద్ధికి విదేశాలనుంచి అప్పులు పుచ్చుకోవటం సహజం కాని కాదు.

అయితే ఆయుధాలకోసం మేము ఎవరినీ అప్పులు అడగటంలేదు. నిజానికి మీ అధ్యక్షులు స్వయంగా తానుగా భారతదేశానికి సైనికసహాయం చేస్తానని చెప్పారు. అయితే ఆ సహాయాన్ని మేము తిరస్కరించాం" అని శ్రీ మీనన్ సమాధాన మిచ్చారు.

ప్రశ్న: కాశ్మీర్ గురించి మిమ్మల్ని ప్రశ్నించదలిచాం. జారింగ్ నివేదిక చూచినట్లయితే ఉభయ పక్షాలూ సహకార వైఖరితోనే వున్నట్లున్నది. అయితే జరిగిందేమీ లేదు. కాశ్మీర్ లో మొదట ఏమి చెయ్యాలంటారు?

జవాబు: కాశ్మీర్ సమస్యలో అసలు విషయం ఇది. మా దేశంపై దాడి జరిగింది. భద్రతాసమితి మధ్యవర్తిత్వంకోసం మేమిక్కడికి రాలేదు. మా దేశంపై దాడి జరిగిందని ఫిర్యాదు చెయ్యడానికి, భద్రతాసమితి చర్య తీసుకోవాలని కోరడానికి వచ్చాం.

ప్రశ్న: ఈ తగాదాను పరిష్కర్త తీర్పుకు పంపడానికి మీరు సిద్ధంగా వున్నారా?

జవాబు: టెక్సాస్ అమెరికాలో భాగమా కాదా అనే విషయాన్ని పరిష్కర్త తీర్పుకు పంపడానికి అమెరికా సిద్ధపడుతుందా?

ప్రశ్న: ఈ రెంటికీ పోలికలేదు. పదేళ్ళ క్రితం ప్రధాని నెహ్రూ కాశ్మీరులో ప్లెబిసైట్ జరుపుతామని, ప్రజల అభీష్టాన్ని పాటిస్తామని ప్రకటనలు చేశారుగదా?

జవాబు: మీతో నేను ఒక విషయాన్ని గురించి చర్చిస్తున్నానంటే, నేను వాకే ప్రతిమాట శిలాక్షరమని

( మిగతా 4 వ పేజీలో )

### ఫ్రెంచి మంత్రివర్గ పతనం

### ఆల్జీరియా సంస్కరణల సమస్యపై

పారిస్, సెప్టెంబరు 30

ఫ్రాన్సులో మరొక మంత్రివర్గం పడిపోయింది. అధికారంలోకివచ్చి మూడు నెలలైనా కాకముందే, మారిస్ బొర్జెస్ మనోరీ మంత్రివర్గం, ఆల్జీరియా సంస్కరణల సమస్యపై ఓడిపోయింది.

ఆల్జీరియా సంస్కరణల బిల్లుపై ఫ్రెంచి పాలక వర్గ పార్టీలలోనే తీవ్రమైన భేదాభిప్రాయాలు తలెత్తాయి. ఆల్జీరియాకు ఎన్నికైన అధ్యక్షుడు వుండాలనే ప్రతిపాదనను మితవాద వర్గాలవారు తీవ్రంగా వ్యతిరేకించారు. అంతట ఈ బిల్లును మంత్రివర్గం విశ్వాస సమస్యగా చేసి, ఓటు తీసుకున్నది.

బిల్లుకు అనుకూలంగా 253 ఓట్లు, ప్రతికూలంగా 279 ఓట్లు వచ్చాయి. నాలుగురోజులు బిల్లుమీద వాదోపవాదాలు చర్చలు జరిగిన తర్వాత ఓటింగు జరిగింది.

ఓటింగు ఫలితం తెలిసిన వెంటనే మంత్రివర్గం సమావేశమై, అధ్యక్షునికి రాజీనామా లేఖను అందజేశారు.

యుద్ధానంతరం ఇది ఫ్రాన్సులో 23 వ మంత్రివర్గం.

### కేరళలో ఆహార పరిస్థితి

### బెంగుళూర్ లో శ్రీ అచ్యుతమీనన్ వివరణ

బెంగుళూరు, సెప్టెంబరు 30

అత్యవసర పరిస్థితులలో ఉపయోగించేందుకు గాను తమ ప్రభుత్వం 24 వేల టన్నుల బియ్యాన్ని కొని నిల్వ చేయాలని అనుకొన్నామని నేడిక్కడ కేరళ ఆర్థిక మంత్రి శ్రీ అచ్యుతమీనన్ నేడిక్కడ పత్రికా విలేఖరులకు తెలియజేశారు.

కేరళ ఆహారసమస్యపై పత్రికలవారు అడిగిన ప్రశ్నలకు శ్రీ అచ్యుతమీనన్ సమాధానం చెపుతూ తమకు అవసరమైన ఆహారధాన్యాలలో సగం వరకే కేరళలో పండగలవని తెలిపారు. తతిమ్మా సగం వెలుపలి నుండి దిగుమతి చేసుకోవలసిందే నన్నారు. ఇందులో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందనీ, వాటిలో కొంతభాగాన్ని రాష్ట్రం మంతటా వున్న ఆహారపు డిపోల ద్వారా ప్రజలకు అందజేస్తామని వివరించారు.

మే నుండి జూలై వరకూ ఆహార విషయంలో కేరళకు చాల కొరతగా వుంటుందని, ఆ కాలంలో కేంద్ర ప్రభుత్వం నెలకు 25 వేల టన్నుల చొప్పున బియ్యాన్ని సరఫరాచేసిందని తెలిపారు. ఇంక ఇప్పుడు పంటలు వచ్చే తరుణం ఆసన్నమైంది కాబట్టి కేంద్రంనుండి వచ్చే సరఫరాను 25 నుండి 10 వేల టన్నులకు తగ్గించారని తెలిపారు. కాని పదివేల టన్నులు చాలవని తాము భావించుచున్నామనీ, అందువలన ఆంధ్ర, తమిళనాడ్ ప్రాంతాలనుండి ఇంకా అవసరమైన బియ్యాన్ని కొంటామని చెప్పారు.

నేడు పూజ్య బాపూజీ జయంతి

"నమో నమో బాపూ
న్యాయ మార్గమె మాపు"

— రైతాంగమే దేశానికి వెన్నెముక. వారిస్థితిగతులు బాగుపడినపుడే దేశానికి కళ్యాణం అని గాంధీజీ ప్రబోధం కాని....

భూస్వాములు ప్రభుత్వం కళ్లుగప్పి, ప్రజలను మోసపుచ్చి, పంచదార ఫ్యాక్టరీలను, సిగరెట్ ఫ్యాక్టరీలను భూముల రేపాయిస్తున్నారు!

కౌల్దారీ, భూ పరిమితి చట్టాలనుండి బయటపడేందుకు తంటాలు పడుతున్నారు!

ఈ కుయత్నాల నరికట్టి, రైతు సేవాసంఘం తుదివిజయం తనదేనని చాటిన

అనుపమ చిత్రం

ఎం.ఎల్.ఏ

తప్పక చూడండి

— ప్రభాత్ రిలీజ్

### ఎక్స్ప్రెస్ రైళ్లు ఢీకొని రెండువందలమంది మరణం

### పశ్చిమ పాకిస్తాన్ లో విషాదసంఘటన

లాహోర్, సెప్టెంబరు 30

పశ్చిమపాకిస్తాన్ లో మాంట్ గామెరీ సమీపాన, ఒక ఎక్స్ప్రెస్ రైలు, నూని ఎక్స్ప్రెస్ తో నిన్న రాత్రి ఢీకొనడంవల్ల రెండువందలమంది చనిపోయారు. 200మందికి పైగా గాయపడ్డారు.

నేటి మధ్యాహ్నం వరకూ 55 శవాలు దొరికాయని, వాయవ్య రైల్వే అధికారులు ప్రకటించారు. మరణించినవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అనధికార అంచనాల ప్రకారం, విరిగిపడిపోయిన పెట్టెల క్రిందినుంచి ఇంకా శవాలను తీయవలసివుంది.

గాయపడినవారిలో 75 మందిని ఆస్పత్రులలో చేర్చారు. ఆస్పత్రులలో ఐదుగురు చనిపోయారు.

లైన్ క్లియర్ రాకముందే క్లియర్ అయినట్టు, సిగ్నల్ ఇచ్చినందున, ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇద్దరు పాయింట్స్ మెన్ ను అరెస్టు చేశారు.

ప్రమాదం గురించి విచారణ జరపడానికి హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సంఘాన్ని నియమిస్తూ, కేంద్ర రవాణాశాఖ మంత్రి మియాన్ జఫర్ షా ఉత్తర్వు చేశారు.

* * *

మైసూరు, బొంబాయి రాష్ట్రాలలో 15 రోజులపాటు పర్యటించి కేంద్ర ఉపమంత్రిణి శ్రీమతి వైలెట్ ఆల్వా ఢిల్లీ తిరిగి వెళ్ళారు.

### కేరళలో మద్యపాన నిషేధం

### "యథాస్థితిని" సాగిస్తామని అచ్యుతమీనన్ వెల్లడి

బెంగుళూరు, సెప్టెంబరు 30

కేరళలో మద్యపాన నిషేధాన్ని రద్దుచేయడానికిగానీ, లేక దాన్ని విస్తరింపచేయడానికిగానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని మంత్రి శ్రీ అచ్యుతమీనన్ నేడిక్కడ పత్రికలవారి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

శ్రీ అచ్యుతమీనన్ హైద్రాబాద్ నుండి తిరువనంతపురం వెడుతూ ఇక్కడికి వచ్చారు.

మద్యపాన నిషేధాన్ని గురించి మీ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటని ప్రశ్నించగా "ప్రస్తుతానికి ఇప్పుడున్న స్థితినే వుంచుతామని నిర్ణయించుకొన్నామని" చెప్పారు.

మలబార్, తిరువనంతపురం జిల్లా, కొచ్చిన్ ప్రాంతంలోని కొన్ని తాలూకాల్లోనూ ప్రస్తుతం మద్యపాన నిషేధం అమలులోవుంది.

## మద్రాసురాష్ట్రగవర్నర్ శ్రీ జాన్ మరణం

మద్రాసు, అక్టోబరు 1

మద్రాసు గవర్నర్ శ్రీ అన్నాపరంబిల్ జోసెఫ్ జాన్ నేడుదయం 1-50 నిముషాలకు మద్రాసుజనరల్ ఆసుపత్రిలో మరణించారు.

శ్రీ జాన్ సెప్టెంబరు మూడో వారంలో జనరల్ ఆసుపత్రిలో చేరారు. పేగుల్లో పుండుకు ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ జయప్రదంగానే జరిగింది. ఆరోగ్యంకూడా కోలుకొంటూనే వున్నారు. నిన్న సాయంత్రం కొద్దిగా జ్వరం తగిలింది. రాత్రి తొమ్మిదిగంటలకు తీవ్రమైంది. ఉదయం 1-50 నిముషాలకు మరణించారు. చివరి ఘడియల్లో ఆయన ప్రక్కన ఆయన సతీమణి వున్నారు.

గవర్నర్ జాన్ మరణవార్త వినగానే ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్, హోమ్ మంత్రి శ్రీ భక్తవత్సలం ఆసుపత్రికెళ్లి శ్రీమతి జాన్ కు తమ హృదయ పూర్వకమైన సానుభూతిని తెలిపినారు.

తెల్లవారుఝాము 3-15 గంటలకు గవర్నర్ జాన్ పార్థివదేహాన్ని ఆసుపత్రినుండి రాజభవనానికి తీసుకొని వచ్చారు. ఈవేళ అంతా రాజభవనంలోనే వుంచి రేపు అంత్యక్రియలు జరుపుతారు.

శ్రీ జాన్ మధ్య తిరువాన్కూర్ లో వైకమ్ సమీపంలోని [illegible] అనే కుటీర గ్రామంలో 64 యేండ్ల క్రిందట జన్మించారు. తిరుచినాపల్లిలోనూ, మద్రాసులోనూ విద్యాభ్యాసం. అలెప్పీలోనూ, తిరువనంతపురంలోనూ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 1937లో తిరువాన్కూర్ స్టేట్ కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డారు.

తిరువాన్కూర్ లో కాంగ్రెసును నిషేధించినప్పుడు శ్రీ జాన్ ను అరెస్టు చేసి 18 మాసాలు జైలు శిక్ష, రూ 1500 ల జుర్మానా విధించారు. కాని ఆందోళనల తరువాతనే విడుదల చేశారు. మరల అరెస్టుచేశారు. చివరికి కేసు ఉపసంహరించుకోబడింది.

1948 లో తిరువాన్కూర్ శాసనసభకు స్పీకర్ గా ఎన్నుకోబడ్డారు. ఒక సంవత్సరం గడిచిన తరువాత ఆర్థికమంత్రిగా తీసుకొన్నారు.

మొదటి జనరల్ ఎన్నికలు అయిన తరువాత కాంగ్రెసు మంత్రివర్గం శ్రీ జాన్ నాయకత్వాన ఏర్పడింది. 1954 లో శాసనసభ రద్దు అయ్యేంత వరకూ ఆయనే ముఖ్య మంత్రిగా వున్నారు. ఆ తరువాత మరల ఏర్పడిన కాంగ్రెసు మంత్రివర్గంలో కొన్నాళ్ళు హోమ్ మంత్రిగానూ, ఆ తరువాత ఆర్థిక మంత్రిగానువున్నారు.

గత నవంబరులో రాష్ట్రాల పునర్నిర్మాణం అనంతరం మద్రాసు గవర్నర్ గా నియమించబడ్డారు.

### తాత్కాలిక గవర్నర్ గా శ్రీ రాజమన్నార్ పదవీ స్వీకారం

మద్రాసు, అక్టోబరు 1

ఈవేళ ఉదయం శ్రీ ఎ. జె. జాన్ మరణం ఫలితంగా ఏర్పడిన ఖాళీ స్థానంలో మద్రాసు ప్రధాన న్యాయమూర్తి శ్రీ పాకాల వెంకట రాజమన్నార్ మద్రాసు గవర్నర్ గా పదవీ స్వీకారం చేశారు.

గవర్నర్ ను నియమించేంతవరకూ శ్రీ రాజమన్నార్ గవర్నర్ పదవి నిర్వహిస్తారు.

## రాష్ట్ర ఎన్. జీ. ఓ. ల జీత భత్యాల విచారణ

### కేంద్ర పేకమిషన్ కి నివేదించాలని దక్షిణప్రాంత ఎన్.జీ.ఓ. సమాఖ్య విజ్ఞప్తి

హైద్రాబాద్, సెప్టెంబరు 30

కేంద్ర ప్రభుత్వం నియమించిన పేకమిషన్ విచారణాంశాలలో రాష్ట్ర ఉద్యోగుల జీతభత్యాల సమస్యను కూడా చేర్చాలని కోరుతూ, దక్షిణ ప్రాంత ఎన్. జీ. ఓ ల సమాఖ్య నిన్న రాత్రి ఒక తీర్మానం చేసింది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల మధ్య వ్యత్యాసాలు కూడా పోవాలని వీరు కోరారు.

ఈ సమాఖ్యకు నిన్న కేంద్ర హోంమంత్రి శ్రీ గోవిందవల్లభ పంత్ ప్రారంభోత్సవం జరిపిన తర్వాత, రాత్రి శ్రీ పి. సత్యనారాయణమూర్తి అధ్యక్షతన ప్రతినిధుల సమావేశం జరిగింది. మద్రాసు, కేరళ ఆంధ్ర, మైసూరు రాష్ట్రాలకు చెందిన 50 మంది ప్రతినిధులు చర్చలలో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో సమాఖ్య నిబంధనావళిని ఆమోదించారు. శ్రీ ఎస్. కృష్ణస్వామి రావ్ ని అధ్యక్షునిగా, ఆర్. గోవిందస్వామి చెట్టియార్ ని ఉపాధ్యక్షునిగా, టి. శరదారావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

ఈ సమాఖ్యలో అనుబంధించబడిన శాఖలకు అభినందనలు తెలుపుతూ ఒక తీర్మానం చేశారు. సమాఖ్యను గుర్తించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రాన్ని కోరుతూ మరొక తీర్మానం చేశారు.

### నిరస్త్రీకరణ ఉపసంఘ నివేదిక

### జనరల్ అసెంబ్లీలో చర్చకు అవకాశం

న్యూయార్క్, సెప్టెంబరు 30

నిరాయుధీకరణ ఉపసంఘం నివేదికను జనరల్ అసెంబ్లీకి, భద్రతా సమితికి నివేదించడానికి, నిరస్త్రీకరణ సంఘం నేటిరాత్రి అంగీకరించింది. ఓటు లేకుండానే ఈ నిర్ణయం జరిగింది.

ఈ ఉపసంఘం ఐదు నెలలపాటు లండన్ లో చర్చలు జరిపిన విషయం పాఠకులకు విదితమే. అయితే ఎట్టి ఒప్పందం లేకుండానే ఆ చర్చలు సమాప్తమైనాయి.

ప్రజానీకానికి సర్వమానవ సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రబోధించే బాలల చిత్రం



ప్రధాని నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్ గార్లచే గొప్పగా ప్రశంసించబడిన ఆహ్లాదమిచ్చు చిత్రం

ఈ క్రింది కేంద్రాలలో మ్యాటినీతో ప్రారంభం

| | | | |
|---|---|---|---|
| విజయవాడ | శ్రీ దుర్గ | నెల్లూరు | శేష్ మహల్ |
| విజయనగరం | శ్రీ కృష్ణ | [illegible] | విద్యామహల్ |
| విశాఖపట్నం | శ్రీ లక్ష్మి | బందరు | బృందావన్ |
| కాకినాడ | [illegible] | ఏలూరు | [illegible] |

విజయ రిలీజ్

హేవిళంబినామ సంవత్సర
చాంద్రమాన ఆశ్వయుజశుద్ధ
నవమి 13-20
ఉత్తరాషాఢ 26-03
మహర్నవమి
మహాత్మాగాంధీ జన్మదినం

విశాలాంధ్ర
బుధవారం 2-10-57
10 ఆశ్వయుజం 1879

# గాంధీ జయంతి

నేడు మహాత్మా గాంధీ జయంతి. భారత స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించి, జీవితమంతా జాతీయ పోరాటానికి ధారవోసి, చివరకు ఒక హిందూ మతతత్వవాది తుపాకి కాల్పుల ఫలితంగా మరణించిన, గాంధీ మహాత్ముని జయంతిని భారత ప్రజలందరూ నేడు జరుపుకుంటారు.

గాంధీజీ 1869 అక్టోబరు రెండవ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని పోర్ బందరులో జన్మించారు. మెట్రిక్యులేషన్ చదువు పూర్తి చేసుకుని, లండన్ వెళ్ళి బారిష్టరు పట్టా పొంది వచ్చారు. వృత్తిరీత్యా దక్షిణాఫ్రికా వెళ్ళిన గాంధీజీ మొట్ట మొదటగా బ్రిటిషు సామ్రాజ్యవాదుల జాతి దురహంకార విధానాన్ని చవిజూచారు. రైలు పెట్టెలలో, భోజన శాలలలో, చివరకు మంగలి షాపులలో సైతం భారతీయులకు, బ్రిటిషువారికి మధ్య చూపబడుతున్న జాతివిచక్షణా విధానానికి వ్యతిరేకంగా ఆందోళన చేయసాగారు. దక్షిణాఫ్రికా భారతీయుల పోరాటంలోనే గాంధీజీ, టాల్‌స్టాయి వంటి మహాశయుల బోధనల వైపు ఆకర్షింపబడ్డారు.

1915 లో గాంధీజీ భారత దేశానికితిరిగివచ్చి, స్వదేశాన్ని తన కార్యరంగానికి ప్రాతిపదికగా చేసుకున్నారు. మితవాదులు, అతివాదులుగా చీలివున్న ఆనాటి కాంగ్రెసు సంస్థలో ఐకమత్యం స్థాపించే లక్ష్యంతో గోఖలే, తిలక్ గారల నిద్దరును తనకు గురుతుల్యులుగా ఎంచి, గాంధీజీ రాజకీయ రంగంలో ప్రవేశించారు. యుద్ధానంతరం 1919 లో బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రవేశపెట్టిన నిరంకుశమైన రౌలట్ చట్టాలద్వారా సాగించిన దమననీతికి, పంజాబులో అమలు జరిపిన 'జలియన్‌వాలా బాగ్' దురంతాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని ఐకమత్యాన్ని కలిగించేందుకునిర్మాణ కార్యక్రమాన్ని తీసికున్నారు. స్వాతంత్ర్య సముపార్జనకై త్యాగాలు చేయాలన్న దీక్షను కలిగించేందుకు సహాయనిరాకరణోద్యమాన్ని చేపట్టారు. భారత రాజకీయ జీవితంలో గొప్ప సంచలనాన్ని కలిగించి, భారత ప్రజలందరి యొక్క సమిష్టికృషి, త్యాగాల ద్వారానే స్వరాజ్యం లభించగలదనే సందేశాన్ని దేశ ప్రజలకు అందజేశారు.

1920 నుండి, 1947 వరకు భారత జాతీయ కాంగ్రెసుకు నాయకుడుగా, గాంధీజీ నడిపిన ఉద్యమాలు, వాటిప్రభావాలు ఆధునిక భారత చరిత్రలో అంతర్భాగమైపోయినాయి.

భారత ప్రజల సమిష్టి కృషి, పోరాటం, అపార త్యాగాల ఫలితంగా భారతదేశం 1947లో స్వాతంత్ర్యం సంపాదించింది.

88 వ గాంధీ జయంతి జరుపుకుంటున్న ఈనాడు ప్రజా జీవితంలో నిజాయితీ నిష్కల్మషత్వాల అవసరాన్ని గురించి నొక్కి చెప్పిన గాంధీజీ సూక్తులు ప్రతి ఒక్కరికీ జ్ఞప్తికి వచ్చి తీరతాయి. పది సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెసు పార్టీలో ఈ సూత్రాలు ఎంతగా లోపించాయో, తత్ఫలితంగా వివిధ కాంగ్రెసు మంత్రివర్గాల 'పర్యవేక్షణ' క్రింద అధికారవర్గంలో అవినీతి, లంచగొండితనం, దుబారా ఎంతగా జరుగుతున్నాయో ప్రతిఒక్కరికీ స్పష్టమే. పరిపాలనా యంత్రంలోను ఆ యంత్రాగాన్ని 'పర్యవేక్షించే' కాంగ్రెసుమంత్రివర్గాలలోనుగల ఈలోపంతొలగించబడనిచో, ప్రభుత్వం ప్రకటిస్తున్న ప్రణాళికా లక్ష్యాలు నెరవేరటం అసంభవం.

గాంధీజయంతి సందర్భంలో భారతీయులందరూ దేశ సేవకై అర్పితమైన మహాత్ముని జీవితంలోని, త్యాగశీలత, నిజాయితీ, స్వార్థ త్యాగాలను స్మరించుకుంటూ గాంధీజీ స్మృతికి జోహారు లర్పిస్తారు.

# హిందీని భారత రాజభాషగా చేయడం అక్రమమట!

## మద్రాసుసభలో రాజాజీ ప్రసంగం

మద్రాసు, సెప్టెంబరు 30

హిందీని కేంద్రంలో రాజభాషగా ప్రవేశపెట్టడానికి నిర్ణయం తీసుకొనేముందు భారత ప్రభుత్వం ప్రతిఒక్క రాష్ట్రం అభిప్రాయాన్ని తీసుకోవడం అవసరమని నేడిక్కడ ప్రసంగిస్తూ శ్రీ రాజగోపాలాచారి అభిప్రాయాన్ని వెల్లడించారు.

హిందీని రాజభాషగా ప్రకటించే విషయంలో భారతదేశంలో ప్రతి రాష్ట్రానికీ వీటోను ప్రయోగించే అధికారం వుండాలనికూడా రాజాజీ అన్నారు.

శ్రీ రాజగోపాలాచారి ఇక్కడొక బహిరంగ సభలో ప్రసంగిస్తూ హిందీని భారతదేశ రాజభాషగా చేయడం అక్రమమూ, అన్యాయమూ అని అన్నారు.

ఆయన తన ప్రసంగం ఇంకా యిలా అన్నారు;

ప్రభుత్వానికి సంబంధించిన అతి ముఖ్యమైన విషయాల్లో ఏదైనా మార్పు తీసుకొనిరావాలంటే అందుకు మెజారిటీరాష్ట్రాల ఒప్పుకోలే చాలదు. అన్ని రాష్ట్రాల ఒప్పుకోలుతోనే ఆ మార్పును తీసుకొనిరావాలి. అంటే, ఆ మార్పును చేసేముందు ప్రతి ఒక్క రాష్ట్రానికి వీలులేదని వీటోను ప్రయోగించే అధికారం వుండాలి:

భారత ప్రభుత్వ రాజ్యాంగ స్వరూపం సమాఖ్య స్వభావానికి సంబంధించినదన్న విషయాన్ని హిందీనే రాజభాషగా చేయాలనేవారుగుర్తించాలని నేనుకోరుతున్నాను. ఇప్పుడు మన రాజ్యాంగానికి గల సమాఖ్య స్వభావాన్ని త్రోసిపుచ్చి త్వరత్వరగా దానిని "యూనిటరీ" స్వభావం గల రాజ్యాంగంగా మార్చాలనే ప్రయత్నం జరుగుతున్నట్లు నాకు కనపడుతున్నది

ఫెడరల్ ప్రభుత్వం ఏదైనా ముఖ్యమైన మార్పును తీసుకొనిరావలసివస్తే అది ప్రతి ఒక్క రాష్ట్రం సమ్మతిని పొంది తీరాలి. ఈ సందర్భంలో ప్రతిరాష్ట్రానికీ వీటో అధికారం వుండాలి.

అయితే మన రాజ్యాంగంలో వీటో అధికారం రాష్ట్రాలకు లేకపోవచ్చు. అయినప్పటికీ ముఖ్యమైన మార్పులుతలపెట్టినప్పుడుఅన్ని రాష్ట్రాల అంగీకారం వుండేటట్లుచూడటం సక్రమమైన విషయం. పార్లమెంటు వున్నదనుకోండి. కాని ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను కూడా ఇలా ముఖ్యమైన విషయాల్లో తెలుసుకోవడం అవసరం. ఇటీవల జనరల్ ఎన్నికలు జరిగినప్పుడు హిందీని రాజభాషగా చేసే సమస్యను ప్రజల ముందు ఎందుకు పెట్టలేదో నాకు ఆశ్చర్యంగా వుంది. ఎన్నికల సమయంలో వారీ సమస్యను తీసుకొనివచ్చివుంటే దక్షిణ భారతంలో ఎన్నికల ఫలితాలు మరోవిధంగా వుండేవి.

1965 నాటికి హిందీని రాజభాషగా ప్రవేశపెట్టేందుకు రాజ్యాంగంలో వున్న అవకాశాన్ని గురించి రాజాజీ ప్రస్తావించి ఇలా అన్నారు;

హిందీని రాజభాషగా చేయాలన్న అభిప్రాయాన్ని వదులుకొంటే రాజ్యాంగాన్ని సవరించవలసి వుంటుందని కొందరంటున్నారు. కాని అలా సవరించవలసిన అవసరంలేదని నేను అభిప్రాయపడుతున్నాను.

రాజ్యాంగంలో గల ఆ నిబంధనను ఇప్పుడు సాధ్యంకాదని లేక అవాంఛనీయమని భావించి అమలు జరప నిరాకరించే పూర్తి అధికారం రాష్ట్రపతికీ, భారత ప్రభుత్వానికీ గలదని నేను అభిప్రాయపడుతున్నాను. అయితే నేను చెప్పేదానితో కొంతమంది రాజ్యాంగవేత్తలు విభేదించవచ్చు. ఏది ఏమైనా దీనిని కేవలం న్యాయశాస్త్రం విషయంగా మాత్రమే పరిగణించరాదు.

ఈనాడు ప్రతి ఒక్క అధికార పత్రమూ ఇంగ్లీషులోనే తయారు చేయబడుతున్నది. అంతే కాదు; అధికార జీవనమూ, అధికారుల [illegible]- అన్నీ నేడు ఇంగ్లీషులోనే జరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితి ఈ విధంగా వుండగా దేశం మొత్తం జనాభాలోని మెజారిటీ వోటుతోనే నిర్ణయాలను తీసుకోవడం పొరపాటు పద్ధతి కాగలదు. మెజారిటీ అభిప్రాయాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దడమే కాగలదు. అందువలన భారతప్రభుత్వం హిందీని రాజభాషగా ప్రవేశపెట్టే విషయంలో ఒక నిర్ణయాన్ని తీసుకొనేముందు ప్రతిఒక్క రాష్ట్రం సమ్మతిని పొందితీరాలి. ప్రతిరాష్ట్రం తనపరిపాలనా వ్యవహారాలను తన స్వభాషలోనే జరుపుకోవడం మంచిది. దానిని నేను బలపరుస్తాను కూడా. అంతే కాని ఇతర ప్రజలపై హిందీని రుద్దడాన్ని నేను ఏ మాత్రం అంగీకరించను. హిందీని రాజభాషగా చేయాలంటే ముందు మన విద్యావిధానాన్ని యావత్తూ అందుకు అనుగుణ్యంగా మార్చి వేయాలి.

## నేపాల్ జనరల్ ఎన్నికలు

ఖాట్మండూ, సెప్టెంబరు 30

నేపాల్ జనరల్ ఎన్నికలు ఈ ఏడాది అక్టోబరు 8 వ తేదీన జరగవని నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది. ఇదివరలో మహేంద్రరాజు నిర్ణయించిన తేదీలలో ఎన్నికలు జరపడం అసాధ్యమని ప్రభుత్వం రేడియో ప్రకటన చేసింది.

అనుకున్న తేదీన ఎన్నికలు జరపడానికి చాలా చిక్కులున్నవని ఎన్నికల కమిషన్ చెప్పిన దానిమీద ప్రభుత్వం పై నిర్ణయానికి వచ్చింది. అయితే ఎన్నికలు మళ్ళీ ఎప్పుడు జరిగేదీ ప్రభుత్వం ప్రకటించలేదు.

ఎన్నికలు జరపటానికి లోగడ మంత్రివర్గాలు ముఖ్యంగా ప్రజాపరిషత్తు మంత్రివర్గం తగు ఏర్పాట్లు చెయ్యలేదని, ఎలెక్షన్ కమిషన్ తన నివేదికలో పేర్కొన్నది. ఎన్నికలు జరపడానికి ప్రజాప్రాతినిధ్య చట్టాలు చేయవలసిందిగా లోగడ మంత్రివర్గాలను పదేపదే కోరినప్పటికీ అవి లెక్క చేయలేదని ఈ నివేదిక తెలుపుతోంది.

* * *

మద్రాసు, సెప్టెంబరు 30

సెప్టెంబరు 28 వ తేదీన మధుర సమీపంలో అరెస్టుచేసి డిటెయిన్ చేయబడిన ఫార్వర్డుబ్లాక్ నాయకుడు శ్రీ యు. ముత్తురామలింగ తేవర్‌ను నేడు మద్రాసుకు తీసుకొనివచ్చారు. ఆయనను ఇక్కడ సెంట్రల్ జైలులో వుంచారు.

## అరవిందుని తాత్వికదర్శనం

### తాత్విక, ఐతిహాసిక అధ్యయన గోష్ఠి ముగింపు

విజయవాడ, సెప్టెంబరు 30

ఆరురోజులుగా ఇక్కడ సాగుతున్న భారతీయ తాత్విక, ఐతిహాసిక, అధ్యయన గోష్ఠి విజయవంతంగా ముగిసింది. సాయంకాలం విశాలాంధ్ర ప్రచురణాలయం వారు గోష్ఠిలో పాల్గొన్నవారికి తేనీటివిందు చేశారు.

నేటి వుదయం శ్రీ కంభంపాటి సత్యనారాయణగారి అధ్యక్షతన జరిగిన సభలో శ్రీ బలరామమూర్తి, శ్రీ త్రిపురనేని వెంకటేశ్వరరావు గార్లు తమ వుపన్యాసాలపై వచ్చిన విమర్శలకు సమాధానం ఇచ్చిన తరువాత, శ్రీ శ్రీపాద లక్ష్మీనృసింహం(అడ్వొకేట్, నర్సాపురం) గారు అరవిందుని తాత్విక దర్శనం మీద ఉపన్యసించారు.

మధ్యాహ్నం శ్రీ త్రిపురనేని వెంకటేశ్వరరావుగారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి చర్చలు జరిగాయి. ఈ మాదిరి గోష్ఠులను నిర్వహించేటందుకై అయిదుగురితో ఒక ఉపసంఘాన్ని నియమించారు.

సంకేతం పత్రిక సంపాదకుని కృతజ్ఞతాభి వందనలతో సభ ముగిసింది.

## తూర్పు జర్మనీకి శ్రీ డాంగే పయనం

### ప్రపంచ ట్రేడ్‌యూనియన్ మహాసభలో పాల్గొనేందుకు

బొంబాయి, సెప్టెంబరు 29

భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. ఎ. డాంగే తూర్పుజర్మనీలో జరిగే ప్రపంచ కార్మిక సమాఖ్య మహాసభలో పాల్గొనేందుకు గాను నిన్న రాత్రికి ఇక్కడ నుండిబయలుదేరి వెళ్ళారు.

శ్రీ డాంగే ప్రపంచ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఉపాధ్యక్షుడు.

అక్టోబరు 6 వ తేదీనుండి ఈ మహాసభ ఆరంభమవుతుంది.

## అధికాహారోత్పత్తి పథకాలకే కేంద్రం నుండి సాయం

### కేరళ ఆర్థికమంత్రి వెల్లడి

బెంగుళూరు, సెప్టెంబరు 30

ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో విదేశమారకం అవసరమైన ఏ ఒక్క పథకానికీ తమ నుండి సహాయం లభ్యం కాగలదని భావించవలదని కేంద్ర ప్రభుత్వం కేరళ ప్రభుత్వానికి తెలియపరచిందని నేడిక్కడ శ్రీ అచ్యుతమీనన్ తెలియజేశారు.

కేరళ మంత్రి శ్రీ అచ్యుతమీనన్ నేడిక్కడ పత్రికలవారితో మాట్లాడుతూ ఇంకా ఇలా అన్నారు:

అధికాహారోత్పత్తికీ, నిరుద్యోగులకు, ఉపాధులు కల్పించడంకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే పథకాలకు తమనుండి సహాయం లభ్యం కాగలదని కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. అందువలన కేరళ ప్రభుత్వం అందుకనుగుణ్యమైన ఇరిగేషన్ పథకాలను, సహకార పద్ధతులపై పీచుపరిశ్రమ పథకాలను తయారు చేసింది.

శ్రీ మీనన్ పత్రికలవారు అడిగిన మరికొన్ని ప్రశ్నలకు జవాబుచెపుతూ కొత్త పరిశ్రమలను స్థాపించడానికి తాము అనేక ప్రతిపాదనలను ఆలోచించుతున్నామనీ, ఇందుకు చాలమందితో రాయబారాలను సాగించుతున్నామనీ తెలియజేశారు.

రాష్ట్రంలోవున్న ముడివస్తువును ఆధారం చేసుకొని రబ్బరుటైరు ఫ్యాక్టరీ నొకదానిని నెలకొల్పాలని తీవ్రంగా యత్నించుతున్నామని ఆయన చెప్పారు. అలాగే కాగితం, రయాన్ సిల్కు పరిశ్రమలను ప్రారంభించాలనుకొంటున్నామనీ, అందుకు కావలసిన ముడిపదార్థాలు తమ రాష్ట్రంలో అపారంగా గలవని శ్రీ మీనన్ చెప్పారు.

* * *

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30

ఆర్థిక కమిషన్ తాను తయారు చేసిన నివేదికపై నేడు సంతకంపెట్టి రాష్ట్రపతికి సమర్పించింది. నివేదికను సభ్యులు ఏకగ్రీవంగానే తయారుచేసినట్లు తెలుస్తోంది.

# మాస పత్రికగా 'అభ్యుదయ' పరివర్తన

## సాహిత్యాభిమానులకు అభ్యుదయ రచయితల సంఘంవారి విజ్ఞప్తి

విజయవాడ, అక్టోబరు 1

ఇప్పటివరకు త్రైమాస పత్రికగా వస్తున్న "అభ్యుదయ"ను ఇకమీదట మాస పత్రికగా ప్రచురించడానికి ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం నిశ్చయించింది. అభ్యుదయ సాహిత్యాభిమానులంతా ఈ ప్రయత్నానికి చేయూత నివ్వాలని విజ్ఞప్తి చేసింది.

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గం, 'అభ్యుదయ' పత్రికా సంపాదకవర్గ సభ్యులు, కార్య నిర్వాహక సమితిసభ్యులు విజయవాడలో సెప్టెంబర్ 28, 29 వ తేదీలలో సమావేశమై ఈ క్రింది తీర్మానాలు చేశారు.

1. ఆంధ్ర సాహిత్య, నాటకరంగాలలో అమూల్య కృషి, సేవ చేసిన మానవల్లి రామకృష్ణ కవి, కందూరి సుబ్బారావు, కొప్పరపు సుబ్బారావు, పాయపల్లి సుబ్బారావు, ఉప్పలూరి సంజీవరావు, మాధవపెద్ది వెంకటరామయ్య, పంచాంగం రామానుజాచార్యులు, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగార్ల మృతికి ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం తన గాఢ సంతాపాన్ని తెలియజేస్తోంది.

2. ప్రముఖ కవి, నాటక కర్త శ్రీ రెంటాల గోపాలకృష్ణ గారికి యిటీవల సంభవించిన పత్నీ వియోగానికి ఈసమావేశం తన సంతాపాన్ని తెలియజేస్తోంది.

3. అభ్యుదయ రచయితల సంఘాన్ని రిజిస్టరు చేయించవలసిందిగా కార్యవర్గాన్ని కోరడమైనది.

4. అభ్యుదయ రచయిత సంఘ శాఖల నిర్మాణం ద్వారా సాహిత్య రంగంలో బహుముఖాలుగా కృషి సాగించాలని ఈ సమావేశం తీర్మానించింది.

5. అభ్యుదయ రచయితల సంఘం తరఫున గ్రంథ ప్రచురణకు సహకారసంస్థ నేర్పాటు చేసే విషయమై పరిశీలించుటకు ఈ సమావేశం నిశ్చయించింది.

### విజ్ఞప్తి

ఆంధ్ర సాహిత్యంలో అభ్యుదయ రచయితల సంఘం ఒక విశిష్టమైన సత్సాంప్రదాయాన్ని నెలకొల్పి సాహిత్యంలో రీతిని, ఇతివృత్తాన్ని, ప్రజాజీవితానికి దగ్గరగా తీసుకొనివచ్చింది. అనేక మంది కవులకు, కథకులకు, నూతనోత్సాహాన్ని ఇచ్చింది. సాహిత్య విజయాలను కూడ కొన్నిటిని చేకూర్చుకొన్నది. అభ్యుదయ సాహిత్యము నే విశిష్టమయిన ఆదర్శాన్ని ప్రచారం చేయడానికీ, రచయితల సాధనకు తోడ్పడడానికీ, కొత్త రచయితలకు తోడ్పడడానికీ పత్రిక అవసరం. ఇందుకు అభ్యుదయ రచయితల సంఘం ఒక పత్రికను చాలకాలం విజయవంతంగా నిర్వహించింది. కొన్ని అనివార్య కారణాలవలన కొంతకాలం స్తంభించిపోయిన అభ్యుదయ సాహిత్యోద్యమానికి తిరిగి రెండేళ్ళక్రితంనుంచి నూతనోత్సాహాన్ని కల్పించేందుకు, మహాసభ జరిపి ఒక నిర్దిష్ట ప్రణాళికను రచయితల ముందుంచి తిరిగి పత్రికా ప్రచురణ ప్రారంభించింది. అనేక కష్టనష్టాల నెదుర్కొని కూడ, పత్రికను మంచి స్థాయిలో ఇంతవరకు తీసుకొని వచ్చింది. 'అభ్యుదయ' పత్రిక ఇప్పటివరకు మూడు నెలల కొకసారి వెలువడుతూ వచ్చింది. ఈ సంవత్సరం నవంబరు మొదటి తేదీ నుండి 'అభ్యుదయ'ను మాస పత్రికగా వెలువరించడానికి ఈ సమావేశం నిశ్చయించుకొంది. మాస పత్రిక నిర్వహణ అనేక సాధకబాధకాలతో కూడిన పని కాబట్టి అభ్యుదయ సాహిత్యాభిమానుల నందరినీ, చందాదారులుగా చేరి పత్రికకు బహుళప్రచారాన్ని కల్పించవలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాం. ఈవరకే చందాదారులైనవారు తమ చందా గడువు అయిపోయిన వెంటనే, తిరిగి చందాలు కట్టవలసిందిగాను, కొత్తవారు చందాదారులుగా చేరవలసిందిగాను, స్థానిక గ్రంథాలయాలలో పత్రికను పెట్టించవలసిందిగాను ప్రార్థిస్తున్నాము. రచయితలు తమ తమ వుత్తమ రచనలను త్వరలోపంపి పత్రికను పుష్టిని చేకూర్చవలసినదిగా ప్రార్థిస్తున్నాము.



గాంధీజీ స్మృతి చిహ్నాలు

# గాంధీజీ 50 ఏళ్ళనాడు టాల్‌స్టాయ్‌కి వ్రాసిన జాబు

## ఇటీవలనే బయటపడ్డ వైనం

లియోటాల్‌స్టాయ్‌కీ - మహాత్మా గాంధీకీ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగి అర్థశతాబ్దం అయిపోయింది. వీటిని టాల్‌స్టాయ్ స్నేహితుడైన బి. ఐ. బిర్యుకోవ్‌లాంటి వారు లోగడ ప్రకటించినప్పటికీ ఒక ముఖ్యమైన ఉత్తరం మాత్రం ఎవరి దృష్టికీ రాలేదు. కనీసం అటువంటి ఉత్తరం ఒకటి ఉందనిగాని, అది కనపడటం లేదనిగాని ఎవ్వరూ అనలేదు.

ఇటీవల సోవియట్ రష్యాలోని నికొలాయ్ ఫూజిన్, ఎలిజావెటసెలెంకో అనువారలకు యాస్నాయా పోల్యానా మేనర్ మ్యూజియంలో వున్న పాత ఇంగ్లీషు పత్రికల ఒక కట్టలో 1909 నవంబరు 10 వ తేదీన గాంధీజీ టాల్‌స్టాయికి వ్రాసిన యీ లేఖ దొరికింది.

ఈ ఉత్తరంతోపాటు టాల్‌స్టాయ్ కోడలు ఓ. కె. టాల్‌స్టాయ్ ఇంగ్లీషులో నుంచి రష్యన్ భాషలోకి తర్జుమా చేసిన ఒక వ్యాసం కూడా ఆ పత్రికలో ఉంది. గాంధీజీ వ్రాసిన జాబుకు జవాబిద్దామనుకొనే టాల్‌స్టాయ్ దాన్ని చేత్తో పట్టుకొని ఆ పత్రికలో పెట్టి వుంటాడు. కాని, అదే రోజున ఆయనకి జబ్బుచేసింది. అక్కడున్న పత్రికలన్నీ తీసి దాచి వేశారు. అప్పటినుంచి ఇప్పటివరకూ యాభై ఏళ్ళపాటు యీ ఉత్తరం ఆ పత్రికలో దాక్కొని వుంది. ఇప్పుడు బయటపడింది.

వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్ హోటల్
4 విక్టోరియా స్ట్రీట్ లండన్,
డబ్లు. సి, 10-11-1909

'హిందూ' పత్రికలో నేను వ్రాసిన లేఖకు, అందులో మీ విషయమై పొందుపర్చిన వాక్యాలకూ సంబంధించి మీరు పంపిన రిజిస్టర్డు ఉత్తరం అందింది; ధన్యవాదాలు.

మీ ఆరోగ్యం బాగుండలేదని తెలిసి, మీకు శ్రమ కల్గించకుండా ఉండడంకోసం, జాబు అందినట్టు కూడా, అది ఉత్త లాంఛనమే అవడం వల్ల జవాబివ్వలేదు.

ఇప్పుడు మీ ఆరోగ్యం చాల బాగున్నదనీ, రోజూ ప్రొద్దుటిపూట ఉత్తరాలకు సమాధానాలు వ్రాస్తున్నారనీ మిస్టర్ ఐల్మర్ మాడ్‌వల్ల తెలిసింది. చాల సంతోషం. (ఐల్మర్ మాడ్ ఇంగ్లీషులో టాల్‌స్టాయ్ జీవిత చరిత్ర వ్రాశారు. టాల్‌స్టాయ్ రచనలను ఇంగ్లీషులోకి తర్జుమాచేసి ప్రకటించారు.) ఈ వార్త విన్న తర్వాత మీ ఉపదేశాల ప్రకారం అత్యధిక ప్రాముఖ్యమైన అంశాలను గురించి మరికొంత వ్రాయాలనిపించింది.

ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్న ఒక ఇంగ్లీషు మిత్రుడు నా జీవితాన్ని గురించి వ్రాసిన పుస్తక మొకటి యీ ఉత్తరంతో పాటు తమకు పంపుతున్నాను. నా జీవితాన్ని అంకితం చేసి నడుపుతున్న పోరాటం మీద యీ పుస్తకం యొక్క ప్రభావం ఉంది. మీ ప్రోత్సాహాన్నీ, సానుభూతినీ సంపాదించాలని చాలా ఆసక్తిగా ఉన్నవాడి నవటంవల్ల ఆ పుస్తకాన్ని తమకు పంపుతున్నాను. అన్యథా భావించరనే ఆశిస్తున్నాను.

ట్రాన్స్‌వాల్ భారతీయులు జరుపుతున్న పోరాటం ఆధునిక కాలంలో చాల గొప్పదని నా అభిప్రాయం. లక్ష్యం విషయంలోనూ, ఆ లక్ష్యాన్ని సాధించడానికి అవలంబించే విధానాల విషయంలోనూ, ఈ పద్ధతి ఆదర్శమైనది. పోరాటం అయిపోయిన తర్వాత దానినుంచి ఎటువంటి స్వార్థ ప్రయోజనాన్ని అపేక్షించకుండా, పాల్గొన్నవారిలో నూటికి యాభైమంది తాము నమ్మిన ఆశయంకోసం విపరీతమైన బాధలననుభవించిన మరే పోరాటాన్ని నేను కనివిని ఎరుగను. ఈ పోరాటం యొక్క - ప్రాశస్త్యాన్ని గురించి- నా మనసులో ఉన్నంతగా- చాటి చెప్పలేకపోతున్నాను. నేను మీకున్న పలుకుబడి అపారం. మిస్టర్ డోక్ పుస్తకంలో గల యదార్థ వృత్తాంతాలను చూచి సంతృప్తి పడితే, ("ఎం. కె. గాంధి - దక్షిణాఫ్రికాలో భారతీయ దేశభక్తుడు" అని జె. డోక్ ఒక పుస్తకం వ్రాశారు.) ఆ యదార్థ విషయాలను బట్టి నేను చేసుకొన్న నిర్ణయాలు సరైనవే నని తమరుభావిస్తే, పలుకుబడిని ఉపయోగించి, మీకు నచ్చినరీతిగా యీ ఉద్యమానికి ఖ్యాతి తెచ్చిపెట్టాలని మనవి చేస్తున్నాను. ఇది జయప్రదమైతే, మతరాహిత్యంపైన, ద్వేషంపైన, అసత్యంపైన మతమూ, ప్రేమ, సత్యమూ జయించడమే గాక, భారతదేశంలోనూ ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలోనూవున్న కోట్లాది ప్రజలకు-వారు అట్టడుగున పడివున్నవారే కావచ్చుగాక - హింసాపూరితమైన వాదాన్ని భేదించడానికి - కనీసం భారతదేశంలో రాచబాట అవుతుంది. మేము తుదకంటా నిలవగలిగితే - నిలుస్తామనే అనుకుంటున్నాను - అంతిమవిజయంపై నాకు లవలేశం కూడా సంశయంలేదు. మీరుసూచించిన రీతిగా మీరిచ్చే ప్రోత్సాహం మా దీక్షా నిర్వహణలో మమ్మల్ని బలపరుస్తుంది.

సమస్యా పరిష్కారంకోసం సాగుతున్న సంప్రతింపులు విఫలమై పోయాయి. నా సహచరునితోపాటు యీవారంలోనే దక్షిణాఫ్రికాకు తిరిగివెళ్తున్నాను. బందిఖానాను ఆహ్వానిస్తాను. నా కుమారుడుకూడా ఆనందంతో యీ పోరాటంలో చేరాడనీ, అతను ప్రస్తుతం ఆరునెలల కఠిన [illegible] అనుభవిస్తున్నాడనీ తమకు తెలియజేయాలనుకుంటున్నాను. ఈ పోరాటసమయంలో ఇతన్ని నిర్బంధించడమనేది ఇది నాల్గోసారి.

తమరు యీ జాబుకు దయతో జవాబివ్వదలిస్తే, జోహాన్స్‌బర్గ్, ఎస్. ఎ. బాక్సు 6522 కు వ్రాయండి.

తమరు కులాసాగానే ఉన్నారని తలుస్తాను. సెలవు.

భవదీయుడు,
యం. కె. గాంధి.

## సంస్కృతంలో గాంధీ సూక్తి ముక్తావళి

### శ్రీ సి. డి. దేశముఖ్ అనువాదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30

యూనివర్సిటీ గ్రాంట్సు కమిషన్ అధ్యక్షులు శ్రీ సి. డి. దేశముఖ్ గాంధీజీ సూక్తులలో ఒక వందదాకా సంస్కృత భాషలోకి అనువదించారు. వీటికి 'గాంధీజీ సూక్తి ముక్తావళి' అని పేరుపెట్టారు. ఈ పుస్తకాన్ని గాంధీస్మారక నిధివారు ప్రచురించారు. గాంధీజీ జన్మదినోత్సవంనాడు ఈ పుస్తకం ప్రతులు విక్రయింపబడతాయి.

శ్రీ సి. రాజగోపాలచారి గాంధీ సూక్తిముక్తావళికి తొలిపలుకులు వ్రాశారు. అనువాదం చాలాచక్కగా వుందని ప్రశంసించారు.

# లేఖలు

## పటాస్కర్ నివేదిక

మహాశయా!

పటాస్కర్ నివేదిక ఆంధ్రులకు చాలా అన్యాయంచేస్తున్నదని మొదట విమర్శించి, ఆ తర్వాత ఢిల్లీ వెళ్ళివచ్చి ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు తమఅభిప్రాయాన్ని మార్చుకొన్నారు. కనీసం శాసనసభ కాంగ్రెసుపార్టీనైనా సంప్రదించలేదు. పటాస్కర్ నివేదికను నిరాకరిస్తే ప్రధాన మంత్రికి ఆంధ్ర నాయకులకు ఉన్న గౌరవం తగ్గుతుందనికూడా ముఖ్యమంత్రి అంటున్నారు. యిటీవల రాజ్యసభలో శ్రీ జె. వి. కె. వల్లభరావుగారు ఆంధ్ర జాతికి జరిగిన అన్యాయాలు వివరిస్తు పెట్టారు. ఈ జాబితాచూస్తే కేంద్ర నాయకులకు ఆంధ్ర నాయకుల పట్ల ఏపాటిగౌరవం కలదో బోధపడుతుంది.

మనం మొదటినుంచి అతిముఖ్యమైనట్టిదిగా పరిగణిస్తున్న వరోఖారు విషయాన్ని తేల్చని పటాస్కర్ నివేదికను ఆంధ్ర ప్రభుత్వం అంగీకరించడంలో అర్థంలేదు. వరోఖారు సమస్యను పటాస్కర్ సరిగా పరిశీలించలేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులుకూడా అంగీకరించినారుకదా! నెలం తెలుగు ప్రాంతీయ సంఘం కార్యదర్శి నెల్లూరుజిల్లా ఆంధ్రసరిహద్దు సంఘ కార్యదర్శులుకూడా వరోఖారువిషయంలో ఆంధ్రప్రభుత్వం పట్టు సడలించరాదని చెప్పినా, వారి కోర్కెను కూడా త్రోసిపుచ్చి మన ముఖ్యమంత్రి పటాస్కర్ నివేదికను ఆమోదించడం దక్షిణ సరిహద్దు ఆంధ్రులకు అన్యాయం చేయడమే కాగలదు. కనీసం సరైన అంకెల వివరాలను, మ్యాపులను కూడా ఆంధ్ర ప్రభుత్వం పటాస్కర్ ముందు పెట్టలేక పోయిందని ఆయన నివేదిక ద్వారా స్పష్టమౌతున్నది. పటాస్కర్ నివేదికను ఆపాంతం చదివితే ఆంధ్ర ప్రభుత్వవాదనలకు ఆయన ఏపాటి గౌరవమిచ్చారో బోధపడుతుంది. పోతే, చెంగల్పట్టుజిల్లాలోని పొన్నేరి, తిరువళ్ళూరు తాలూకాలు అవి నిర్వివాదమైన, స్పష్టమైన ఆంధ్ర ప్రాంతాలు. అవి మనకు రావడంలో ఎవరి " [illegible] " ఏమీలేదు. నిజానికి ఆ జిల్లాలో మనకు రావలసిన గ్రామాలు ఇంకా చాలా వుండనే వున్నాయి. 1941 జనాభాలెక్కల ప్రకారం మొత్తం చెంగల్పట్టు జిల్లాలో నూటికి 70 వంతుల మంది ఆంధ్రులున్నారు. మరి ఇప్పుడు చెంగల్పట్టు జిల్లాలో నూటికి 70 వంతులు మనకు రాలేదుకదా! ఎవరెన్ని చెప్పినా, పటాస్కర్ నివేదికవల్ల మనకు – ముఖ్యమంత్రి ఇదివరకే ఒప్పుకున్నట్లు అన్యాయం జరిగింది. కాని ఆ అన్యాయాన్ని ఆంధ్ర ప్రభుత్వం ఆమోదించి, ముద్రవేయడం ఆశ్చర్యకరమేకాక విచారకరంకూడా.

ఇట్లు,
తుర్లపాటి వెంకటకుటుంబరావు
విజయవాడ

## తిరుపతి దేవస్థానం బస్ కార్మిక బహిరంగసభ

తిరుపతి, సెప్టెంబరు 28

తిరుపతి దేవస్థానం బస్ కార్మిక సంఘానికి మేనేజిమెంటుకు ఒడంబడిక జరిగిన సందర్భంలో బహిరంగ సభ జరిగింది.

సభకు యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ యం. వెంకటస్వామినాయుడు అధ్యక్షత వహించారు. ఆంధ్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కోళ్ళభక్త సత్యనారాయణ అగ్రిమెంటు వివరాలను వివరించారు. సభాధ్యక్షులు, యూనియన్ కార్యదర్శి శ్రీ రామారావుగారలు కార్మికులకు తోడ్పడినప్రజలకు, పట్టుదలతో పనిచేసిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చిట్టివలస కార్మిక వివాదం

### ట్రిబ్యునల్‌కు పంపాలని అభ్యర్థన

చిట్టివలస, సెప్టెంబరు 24

ఈ నెల 21 వ తేదీన చిట్టివలస లేబర్ యూనియన్ కార్మికసంఘం విస్తృత సమావేశం యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ గిడుతూరి నరసింహులుగారి అధ్యక్షతను జరిగింది. సమావేశానికి అన్ని డిపార్టుమెంట్ల నుండి సుమారు 800 మంది కార్మికులు, కార్యకర్తలు హాజరయ్యారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ జె. వి. కె. వల్లభరావు ఎం. పి మాట్లాడుతూ అఖిలభారత ట్రేడ్ యూనియన్ జనరల్ కౌన్సిల్ చేసిన నిర్ణయాలను వివరించారు. అనంతరం ఈ సంఘం1945 నుండి, ఈ 12 సంవత్సరాల్లోను ఎలా అభివృద్ధి అయిందీ,ఆనాటి కార్మికుల పరిస్థితి, ప్రస్తుత పరిస్థితిని కూడా వివరించారు. కార్మికసంఘాన్ని కార్మికులందరు అతి జాగ్రత్తతో కాపాడుకోవాలని కోరారు.

అనేక మంది కార్మిక కార్యకర్తలు డిపార్టుమెంట్లలో జరుగుతున్న అన్యాయాలను, పనిభారాన్ని గూర్చి మాట్లాడారు. ముఖ్యంగా 'కార్మిక భీమా పథకం' గూర్చి మాట్లాడుతూ దీని వల్ల కార్మికులకు చాలా యిబ్బందులు కలుగుతున్నాయని వివరించారు.

తదుపరి యూనియన్ కార్యదర్శి శ్రీ గుజ్జు రామునాయుడుగారు మాట్లాడుతూ స్కీము నిర్వహణలో జరుగుతున్న లోపాలను వివరించారు. ఈ లోపాలను పోగొట్టుటకు స్కీము ఆశయాలను అమలుపరచుటకు కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలన్నారు.

తరువాత శ్రీ వల్లభరావుగారు మాట్లాడుతూ ప్రభుత్వం నెల్లిమర్ల కార్మికుల తగాయిదాను ట్రిబ్యునల్‌కు పంపినందుకు హర్షిస్తూ, అలాగే చిట్టివలస కార్మికుల యీ దిగువ కోర్కెలను కూడా ట్రిబ్యునల్‌కు పంపాలని కోరారు.

ఈ సమస్యలు గత 1½ సంవత్సరాలనుండి యజమానులముందు, లేబర్ డిపార్టుమెంటు ముందువున్నాయి. ఆ కోర్కెలు యివి:

(1) ప్రస్తుతమున్న వేతనాల స్కేళ్ళను మార్చి, వెంటనే 25% జీతాలు పెంచాలి. (2) కార్మికులు నివసించే కార్మికపేటను వెంటనే ప్రభుత్వ పద్ధతిలో పునర్నిర్మించి అందరి కార్మికులకు గృహవసతి కల్పించాలి, (3) 'కార్మిక భీమా' చట్టాన్ని సవరించి కార్మికులందరి శ్రేయస్సుకు వుపకరించేటట్లు, నిర్వహణలో మార్పులు తీసుకురావాలి. (4) 1956-57 సంవత్సరాలకు సంవత్సరానికి 2 నెలలజీతం చొప్పున బోనస్‌గా యివ్వాలి.

యీ కోర్కెలన్నింటినీ విస్తృత సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

## గ్రామోద్యోగుల కమిటీ పర్యటన

విజయవాడ, సెప్టెంబరు 28

గ్రామోద్యోగుల సమస్యలపరిశీలన కమిటీ అనంతపురంజిల్లాలో అక్టోబరు 6, 7 తేదీలలోను, 13, 14 తేదీలు శ్రీకాకుళం జిల్లాలోను పర్యటించనున్నది. ఆయా ప్రాంతాల గ్రామోద్యోగుల సంఘాలు కమిటీవారికి మెమొరాండాలు సమర్పించడానికి తగు సన్నాహాలు చేస్తున్నారు.

---

పుతూ మాట్లాడారు. స్థానిక కార్మిక నాయకులు శ్రీ క. కృష్ణారెడ్డి తొలగించినవారందరు పనిలోనికి పోయే వరకు కార్మికులు, ప్రజలు ప్రత్యేక శ్రద్ధతో మేనేజిమెంటు ఎత్తుగడలను కనిపెడుతూ వుండాలని, కార్మికులు తమ జీవితాలను బాగుచేసుకోడానికి చేసే కృషిలో ప్రజల అండ ఎప్పుడూ వుంటుందని తెల్పారు.

వెలువడింది:

స్టాలిన్ యుగం

అన్నా లూయీ స్ట్రాంగ్

పేజీలు : 258 - వెల : 2.50

(పోష్టేజి అదనం)

ప్రచురణ : విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ.
పీపుల్స్‌బుక్‌హౌస్, హైద్రాబాద్.

## 'చెరగని అక్షరాలు'

### హైద్రాబాద్‌లో కథలసంపుటి ఆవిష్కరణ

హైద్రాబాదు, సెప్టెంబరు 27

ఈ సాయంత్రం హిమాయత్ నగర్‌లో 'నవ్యభారతి' రెండవ ప్రచురణ శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తిగారి 'చెరగని అక్షరాలు' కథల సంపుటిని శ్రీ త్రిపురనేని గోపీచంద్‌గారు ఆవిష్కరించారు. సభకు దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలగు ప్రముఖులు వచ్చారు.

నవ్యభారతిని గురించి పరిచయం చేస్తూ శ్రీ బి. వి. కుటుంబశాస్త్రిగారు ఈ విధంగా చెప్పారు: "ఈ నవ్యభారతి 1955 జనవరి 1 వ తేదీన అవతరించింది. ఆనాడే మొదటి ప్రచురణ శ్రీ ఇసుకపల్లి లక్ష్మీవరసింహశాస్త్రిగారి కథలసంపుటి 'కదటి తీపులు' ఆవిష్కరింపబడింది. ముఖ్యంగా కథల పుస్తకాలు ప్రచురిస్తున్నప్పటికీ 'నవ్యభారతి' రాజకీయ, ఆర్థిక, సాంఘిక విషయాలకు సంబంధించిన పుస్తకాలనుకూడ వివేకవంతులైన ప్రజలకు అందచేయుటానికి కృషి చేస్తుంది.

శ్రీ త్రిపురనేని గోపీచంద్ గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ ఇలా అన్నారు:

కథానిక ప్రక్రియలను గురించి తెలుసుకుందామనే ఉద్దేశంతో, చెకోవ్, టాల్‌స్టాయ్, మామ్, మొపాసా, మొదలగువారి కథలు పరిశీలించాను. కథానికకు సమగ్రమైనదిగా నిర్వచనంచేయలేమనితోచింది. బొమ్మ నవలల్లాంటి పెద్దకథలు [illegible] నిర్వచనం స్థిరస్వరూపం కలది. రచన అనుదినం మార్పు చెందుతుంది. ఒక నిర్వచనాన్నిబట్టి కథ వ్రాయాలనే ఉద్దేశంతో దాని సరిహద్దులో ఇరుకొనరాదు. కథారచన సంవిధానం అనంతమైనది. కథానిక ప్రక్రియల సరిహద్దులను నిర్ణయించటం కష్టం. అట్లాగే నవలలు, కథలు, వీటిని నిర్వచించటంకూడ అంత సులభ సాధ్యం కాదు. ఎన్నో మార్పులు రచనావిధానంలో వస్తున్న ప్రగతిలో ఒకమెట్టుకి వచ్చేటప్పటికి కథలలో సంఘటనయొక్క ప్రాముఖ్యం లేకుండ పోయింది. చేట్సు కథలు ముఖ్యంగా ఒక వాతావరణాన్ని సృష్టించటం కోసమే వ్రాయబడ్డాయి. ఆ వాతావరణ సృష్టిలో సంఘటన ఒక పరికరం మాదిరిగా కేవలం ఉపయోగపడుతుందిగాని, ఆ సంఘటనను విడిగా చూస్తే కథకు ఏమీ ప్రయోజనం ఉండదు. చేట్సు కథలు నాకు చాల నచ్చినాయి. అదే స్థాయిలో నడచినవి అవటం వలన శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తిగారి కథలు నాకు ఎంతో ఆనందాన్ని కల్గించాయి.

ఇంతే కాకుండా కథారచనలోని ప్రగతి ఇంతటితో ఆగిపోయినట్లుగ తోచదు. స్థూలమైన, స్థిరమైన నిర్వచనంలో ఆగిపోక ముందుకు ఎంతో వేగంగా సాగిపోతున్నాయి. శ్రీ దక్షిణామూర్తిగారి కొన్ని కథలు అలాంటి నిర్వచనంలో నిలబడక క్రొత్త దారులు తొక్కి, నాకెంతో సంతోషాన్ని కల్గించాయి. వీరి కథలు చదివిన తర్వాత వీరిలోని శక్తులు ముందు ముందు ఇంకా విజృంభించి కథానికా సాహిత్యంలో ఎక్కువ కృషి చేయగలరని గట్టి నమ్మకం ఏర్పడింది.

రచయితలు తమ రచనల ద్వారా డబ్బు చేసుకొనే పద్ధతులుకూడ నేర్చుకోవాలి. కథల పుస్తకాలు విపరీతంగా అమ్ముడుపోతున్న రోజులివి. అందరికీ క్రొత్త రచనలు చదవాలనీ, అర్థంచేసుకోవాలనీ ఆకాంక్ష బయలు దేరింది. అమ్ముడుబోయిన పుస్తకాల ద్వారా వచ్చిన ఆదాయంలో రచయితకు భాగం వుండేలాగున చూడాలి. రచయితకు తన రచనలమీద జీవించగల స్తోమత కల్పించుటకు అనువైనమార్పులు రావాలి."

తర్వాత శ్రీ కురుగంటి సీతారామయ్యగారు మాట్లాడుతూ, ఇసుకపల్లివారు కథానికా సాహిత్యంలో చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## పిడుగురాళ్ళలో బహిరంగసభ

పిడుగురాళ్ళ, సెప్టెంబరు 28

పల్నాడు తాలూకా పిడుగురాళ్ళలో ఈ నెల 21 వ తేదీన జరిగిన పెద్ద బహిరంగసభలో శాసన సభ్యులు శ్రీ మండపాటి నాగిరెడ్డిగారు మాట్లాడుతూ ఆహార సమస్య విషయంలో ప్రభుత్వ అలక్ష్యవైఖరిని నిరసించారు. కేరళ ప్రభుత్వం ఆదర్శ విధానాలను వివరించారు. 22వ తేదీన గ్రామ కమ్యూనిస్టుకమిటీ సమావేశమై ప్రాంతీయ సమస్యలపై పార్టీ నిర్మాణాన్ని పార్టీసభ్యత్వ సమస్యలను చర్చించారు.

## కనిగిరితాలూకాలో కమ్యూనిస్టు నాయకులపర్యటన

### వివిధ గ్రామాల్లో సభలు సమావేశాలు

సేరేడుపల్లె, సెప్టెంబరు 25

కమ్యూనిస్టు శాసనసభ్యుడు శ్రీ జి. ఎల్లమందారెడ్డిగారు జిల్లా కమ్యూనిస్టు కమిటీ సభ్యులు శ్రీ నాగంరెడ్డి నరసింహారెడ్డిగారు ఈ నెల 18 నుండి 19 వ తేదీవరకు సేరేడుపల్లె, పోతవరం, వెలుగున్నవారిపాలెం, పిల్లవాండ్లపల్లె, పెదయిర్లపాడు, మురుగుమ్మి గ్రామం, వెంగళాయపల్లె, మాదిగపల్లె, మూడాయిపల్లె, దివాకులపురం గ్రామాలలో పర్యటించి ప్రజలను కలుసుకొని వారి కష్టసుఖాలను విచారించారు. యువకుల సమావేశాలు బహిరంగసభలు జరిపారు.

17 వ తేదీన పెదయిర్లపాడు శ్రీ సార్ల చిన వేమయ్యగారి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో శ్రీ ఎల్లమందారెడ్డిగారు, బంజరుభూముల సాగు, భూసంస్కరణలు మొదలైన విషయాలలో ఆంధ్ర కేరళ ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూపారు. ఆంధ్రప్రభుత్వం భూస్వాముల పక్షపాత వైఖరి నవలంబించుతోందని అన్నారు. ఆహారసమస్య గురించి మాట్లాడుతూ గ్రామగ్రామాన చౌకడిపోలు పెట్టించవలసిన అవసరం ఎంతో ఉందన్నారు.

## రాజోలు తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం

రాజోలు, సెప్టెంబరు 24

తూర్పు గోదావరిజిల్లా రాజోలు తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం అంతర్వేదిపాలెంలో ఈ నెల 19, 20, 21 తేదీలలో జరిగింది.

సమావేశానికి జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ ఇసుగంటి నారాయణరావు, కార్యవర్గ సభ్యులు పెదపాటి వెంకట్రావు, దేవదానం గార్లు హాజరయ్యారు.

సమావేశంలో రైతు, వ్యవసాయ కూలీ సంఘాల పునర్నిర్మాణం, జీడిపప్పు కార్మికుల స్థితిగతులు, ఆహార ధాన్యాల పెరుగుదల పార్టీ పునర్నిర్మాణ ఉద్యమం మొదలగుగల సమస్యలను చర్చించారు.

## జీడిపప్పు కార్మికులకు న్యాయమైన కూలి యివ్వాలి

రాజోలు, సెప్టెంబరు 28

అంతర్వేది పాలెం[illegible]పేట గ్రామంలో జీడిపప్పు వ్యాపారం లక్షల రూపాయలపై సాగుతుంది.

కాని జీడిపప్పు కార్మికులకు యిస్తున్న కూలిమాత్రం బహుతక్కువ. రోజల్లా కష్టపడిపనిచేసినా 0-10-0 కంటె ఎక్కువకూలీ గిట్టుబాటు కాదు, జీడిపప్పు కూలీలు కోరుతున్న న్యాయమైన కోర్కెలను యజమానులు అంగీకరించి కార్మికులకు కూలీ హెచ్చించాలని తాలూకా కమ్యూనిస్టు కమిటీ విజ్ఞప్తి చేస్తూ తీర్మానించింది.

## హుజూరునగరు తాలూకాలో ప్రజల ఇబ్బందులు

హుజూరునగరు, సెప్టెంబరు 24

నల్లగొండజిల్లా హుజూరునగరు తాలూకాలో ఆహార ధరలు విపరీతంగా పెరిగినందువల్ల ప్రజలు పడుతున్న అవస్థలను వివరిస్తూ తాలూకా ప్రజాసంస్థల నాయకులు తహశీల్‌దారుకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రతిగ్రామాన చౌకడిపోలు స్థాపించాలని వారు కోరుతున్నారు.

ఈతాలూకాలో తాలూకా కమ్యూనిస్టుపార్టీ, రైతుసంఘాల నాయకత్వాన 20 గ్రామాలప్రజల సంతకాలు సేకరించి ఈనెల 20 వ తేదీన తహశీల్‌దారుకు మెమొరాండములు అందించారు.

హుజూరునగరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ దొడ్డానర్సయ్యగారు, తాలూకా కమ్యూనిస్టుపార్టీ రైతుసంఘం నాయకులు శ్రీ చింతలపూడి రాములు శ్రీ అరిబండి లక్ష్మీనారాయణ, శ్రీ దొడ్డా నారాయణరావు, శ్రీకమతం రాఘవయ్యగారలు ప్రజలతరఫు ప్రతినిధులుగా తహశీలుదారుకు మెమొరాండములు సమర్పించారు.

* * *

ముదుకులత్తూర్ శాసన సభ్యుడు శ్రీ శశివర్ణ తేవార్ గృహాన్ని మద్రాస్ పోలీసులు ఆదివారంనాడు సోదా చేశారు.

## గన్నవరం తాలూకా కమ్యూనిస్టు కమిటీ విస్తృత సమావేశం

పెదవోగిరాల, సెప్టెంబరు 28

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా కమ్యూనిస్టు పార్టీ విస్తృత సమావేశం యీ నెల 21, 22 తేదీలలో పెదవోగిరాలలో జరిగింది. సమావేశానికి 30 గ్రామాలనుండి 80 మంది కార్యకర్తలు హాజరయ్యారు.

జిల్లా కమిటీ తరఫున కె. ఎస్. ఆర్. శాస్త్రిగారు, కడియాల గోపాలరావుగారు హాజరయ్యారు.

తాలూకా కమిటీ తరఫున సెక్రటరీ శ్రీ మానికొండ సుబ్బారావుగారు తాలూకా పార్టీ పరిస్థితిని, ప్రజల యెదుర్కొనే సమస్యలనువివరించుచుతూ ఒక రిపోర్టును సమావేశంలో ప్రవేశపెట్టారు. సభ్యులందరు చర్చించి రిపోర్టును ఆమోదించారు. సభ్యులు వివిధ సమస్యలపై చర్చించి బాధ్యతలు విభజించుకొని రైతు వ్యవసాయకూలీ కార్మికరంగాలలో కేంద్రీకరించి పనిచేయాలనే నిర్ణయాలు చేయబడ్డాయి.

### బహిరంగసభ

22 వ తేదీ రాత్రికి పంచాయితీ బోర్డు అధ్యక్షుడు శ్రీ బొమ్మారెడ్డి కోటిరెడ్డిగారి అధ్యక్షతనుబహిరంగసభ జరిగింది. సభలో రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ కడియాల గోపాలరావుగారు మాట్లాడుతూ పది సంవత్సరాల కాంగ్రెసు పాలనలో పేదప్రజల పరిస్థితులు మారలేదని అన్నారు. ఆహారధాన్యాల దిగుమతికి ఏటా 200 కోట్లు ఖర్చు చేస్తున్నారనీ వ్యవసాయక దేశమైన మనదేశంలో ఆహారం పండించేవారు లేకనా యీఖర్చు అని ప్రశ్నించారు. పేదలకు భూమి యివ్వడం చేతకాక వందల వేల ఎకరాల భూమిని భూస్వాముల చేతులలో ఉంచి ఆహార సమస్యను ఎలా పరిష్కరించుతారని అడిగారు. అందుచేత సత్వర భూసంస్కరణలను తీసుకురావాలని అన్నారు. ప్రణాళికను జయప్రదంగా నిర్వహించాలంటే తీసుకోవలసిన కార్యక్రమాన్ని వివరించారు. కేరళ ప్రభుత్వం కొద్దిరోజులలో అమలుజరిపిన సంస్కరణలను వివరించారు.

తాలూకా రైతుసంఘ కార్యదర్శి శ్రీ అట్లూరి శ్రీమన్నారాయణగారు కూడా మాట్లాడారు.

సగ్గురు అమానీ చెరువుగండి కొట్టించినందుకు నిరసించుతూ, చౌక డిపోలు తెరవాలని కోరుతూ, పెదవోగిరాల మురుగు కాల్వను వెంటనే మరమ్మతు చేయాలని కోరుతూ వుయ్యూరు పంచదార కార్మికులపై నిర్బంధ విధానాన్ని నిరసించుతూ తీర్మానాలు చేశారు.

## గుంతకల్లు జవుళి కార్మికుల వార్షికసభ

### అక్టోబరు మూడవవారంలో

గుంతకల్లు సెప్టెంబరు 28

గుంతకల్లు ఎ. సి. ఎస్. మిల్లు కార్మిక సంఘ ప్రథమవార్షిక సభ అక్టోబరు 20 వ తేదీన జరుపడానికి మంత్రి శ్రీ సంజీవయ్య వివిధపక్షాల పార్లమెంటు శాసనసభ సభ్యులను, ట్రేడ్‌యూనియన్ నాయకులను పిలవడానికి నిశ్చయించారు.

కార్మిక వివాదచట్టం ప్రకారంగా 45 రోజులలోపల కార్మికుల కనీస కోర్కెలు అంగీకరించని పక్షంలో తరువాత పరిణామాలకు మేనేజిమెంటు పూర్తి బాధ్యత వహించాలని నోటీసు యిచ్చారు. అందులో తమ కనీస కోర్కెలను తెలియజేశారు.

## అంబరు చర్ఖా శిక్షణ

### దరఖాస్తుదార్లకు సూచనలు

కాకినాడ, సెప్టెంబరు 28

కర్నూలుజిల్లా బనగానిపల్లెలోను, తూర్పు గోదావరిజిల్లా ప్రత్తిపాడులోను అంబరు చర్ఖా శిక్షణ విద్యాలయాలలో అక్టోబరు 7 వ తేదీన, అక్టోబరు 15 వ తేదీ నుండి నూతనవర్గాలు ప్రారంభిస్తారు. రెండు కేంద్రాలలోను చెరి 50 మందిని చేర్చుకుంటారు. ఈ వర్గములు ఆరు నెలలు జరుగుతాయి. అగత్యమని నిర్ణయించిన వారికి నెల రు 40/- స్టయిఫెండు ఇస్తారు. స్కూలుఫైనల్ మెట్రిక్యులేషన్, లేదా దానితో సమానమైన పరీక్షలలో ఉత్తీర్ణులైన 18 సంవత్సరాలు దాటినవారై వుండాలి. గ్రామంలో పనిచేసేప్రావీణ్యత కూడా ఆలోచిస్తారు. దరఖాస్తులు అక్టోబరు 15 వ తేదీలోగా చేరాలి. దరఖాస్తుదారులలో ఎంపికచేయబడినవారు ఇంటర్వ్యూ కొరకు విజయనగరం, కాకినాడ, విజయవాడ ఒంగోలు, తాడిపత్రి కేంద్రాలకు నిశ్చిత తేదీలకు హాజరుకావలసి వుంటుంది. వివరాలకు "సబ్ జోనల్ కార్యాలయం, ఖాదీ గ్రామోద్యోగ కమిషన్, పోస్టుబాక్సు నెం 41 కాకినాడ"కు వ్రాయాలి.

## శ్రీ కె. ఎల్. నరసింహం లీప్జిగ్ ప్రయాణం

### ప్రపంచ ట్రేడ్‌యూనియన్ మహాసభకు

విజయవాడ, సెప్టెంబరు 28

ప్రపంచ కార్మిక సమాఖ్య నాల్గవ మహాసభ సందర్భంలో తూర్పు జర్మనీలోని లీప్జిగ్ వెళ్లుటకు శ్రీ కె. ఎల్. నరసింహంగారు 28 వ తేదీన బొంబాయికి ప్రయాణమై వెళ్లారు. యీ సందర్భంలో వీరికి సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, ఆంధ్రప్రదేశ్ బి. ఎల్. టి. డి కార్మిక సంఘం, ఆంధ్రా సిమెంటు కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్, కృష్ణాజిల్లా మోటార్‌వర్కర్సు యూనియన్, ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్, సదరన్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, బెజవాడ బ్రాంచి సదరన్ రైల్వే లైసెన్సుడ్ పోర్టర్సు యూనియన్, జార్జిఓక్స్ ఎంప్లాయీస్ యూనియన్, మ్యునిసిపల్ వర్కర్సు యూనియన్, గుంటూరు పట్టణ పాకీ కార్మికసంఘం, ఆంధ్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్లు మొదలైన వివిధ కార్మికసంఘాల తరఫున వీడ్కోలు యిచ్చారు. శ్రీ కె. ఎల్. నరసింహంగారు బొంబాయివెళ్ళి 30 వ తేదీన అక్కడనుండి విమానంపై జర్మనీ చేరుకుంటారు.

ఈసందర్భంలో ఆయన ప్రయాణ ఖర్చులనిమిత్తం యీదిగువ సుదహరించిన సంఘాలు విరాళాలను ఇచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ బి. ఎల్. టి. డి. వర్కర్సు యూనియన్ 24 బ్రాంచీలు 822/-లు, బి. ఎ. టి. లేబరు యూనియన్ గుంటూరు 374/-లు, డిటో మంగళగిరి 60/-లు, ఆంధ్రరాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ బ్రాంచి 116/-లు, సదరన్ రైల్వే లైసెన్సుడు పోర్టర్సు యూనియన్ 50/-లు, ఆంధ్ర సిమెంటు కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ 25/-లు మొత్తం 1447/-లు.

## సుదర్శన్ కంపెనీ కార్మికుల రాయబారం

### కార్మికశాఖా మంత్రివద్దకు

విజయవాడ, సెప్టెంబరు 30

స్థానిక సుదర్శన్ కంపెనీ కార్మిక సంఘాధ్యక్షులు కె. రాజన్, కార్యదర్శి ఎస్. వి. సుబ్బరాజు, కార్యవర్గ సభ్యుడు శ్రీ వెంటయ్యగారితోబాటు సిటీట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సహాయ కార్యదర్శి శ్రీ వెల్లంకి సుబ్బారావు, ఆంధ్ర సిమెంటు కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీ శివరామకృష్ణయ్యగార్లు, కార్మిక శాఖ మంత్రి శ్రీ సంజీవయ్యగారు హైద్రాబాదు వెళుతున్న సందర్భంలో వారిని విజయవాడ రైల్వేస్టేషన్‌లో కలుసుకొని మెమొరాండం సమర్పించారు. యజమాని లేబర్ కమీషనర్ సలహాను సైతం లెక్కచేయడం లేదనీ సమ్మె ప్రశాంతంగా సాగుతోందనీ, అందువల్ల యజమానిని – కార్మిక ప్రతినిధులను హైద్రాబాద్ పిలిచి సమస్యను పరిష్కరించవలసిందనీకోరారు.

అందుపై మంత్రి సమాధానం చెబుతూ హైద్రాబాద్‌వెళ్ళిన తరువాత అవసరమైన తగుచర్య తీసుకుంటామని చెప్పారు.

నేటి వుదయం విజయవాడ సబ్‌కలెక్టరు సమ్మె జరుగుతున్న ప్రదేశానికివచ్చి సమ్మె ప్రశాంతంగా జరుగుతున్న విషయాన్ని చూసి వెళ్ళారు.

## యజమానుల వైఖరిపట్ల నిరసన

విజయవాడ, సెప్టెంబరు 25

విజయవాడలోని సుదర్శన్‌కంపెనీ యజమాని అక్రమ చర్యలను ఖండిస్తూ, కార్మికుల సమ్మెను బలపరుస్తూ కృష్ణాజిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మిక సంఘం కార్యవర్గంవారు 23 వ తేదీన ఇక్కడ తీర్మానించారు. సమ్మెనిధికి రు 5/-లు యివ్వడానికి నిశ్చయించారు.

## శ్రీ పెనమకూరి సాంబశివరావుగారి మృతి

### విజయవాడ న్యాయవాద సంఘ కార్యదర్శి

విజయవాడ, సెప్టెంబరు 30

స్థానిక న్యాయవాద సంఘ కార్యదర్శి శ్రీ పెనమకూరి సాంబశివరావుగారు నేటి తెల్లవారుఝామున రక్తపుపోటు జబ్బుతో మృతిచెందారు. పలువురు న్యాయవాదులు, మిత్రులు వెళ్ళి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## బజారు ధరలు

విజయవాడ, అక్టోబరు 1

(మధ్యాహ్నం గం. 1 వరకు)

### బంగారం ధరలు

| | | | |
|---|---|---|---|
| కేలిమిపొట్లా | 107 | 8 | 0 |
| పూసా | 105 | 8 | 0 |
| నవరసు | 72 | 0 | 0 |
| వెండి 100 తులములు | 185 | 0 | 0 |
| 1 తులము | 1 | 14 | 6 |

### ధాన్యం ధరలు

| | | | |
|---|---|---|---|
| 24 నెంబరు | 27 | 0 | 0 |
| సంకరసన్నాలు | 24 | 0 | 0 |
| 12 నెంబరు | 23 | 0 | 0 |
| అక్కుళ్లు | 28 | 8 | 0 |
| కుసుమ | 22 | 12 | 0 |
| గొజామణి | 22 | 12 | 0 |

### బియ్యం ధరలు

| | | | |
|---|---|---|---|
| 24 నెంబరు | 65 | 0 | 0 |
| సంకరసన్నాలు | 61 | 0 | 0 |
| 12 నెంబరు | 59 | 0 | 0 |
| అక్కుళ్ళు | 57 | 8 | 0 |
| కుసుమ | 57 | 8 | 0 |
| గొజామణి | 57 | 8 | 0 |

### అపరాల ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| మినుములు 248 శే॥ | | 55 | 0 | 0 |
| కందులు | | 36 | 0 | 0 |
| నల్లపెసలు (మాగాణి) | | 48 | 0 | 0 |
| పచ్చపెసలు 280 | | 48 | 0 | 0 |
| ,, (మెట్ట) | | 37 | 0 | 8 |
| శెనగలు (దేశవాళీ) | | 39 | 0 | 0 |
| శెనగలు (పంజాబు) | | 34 | 8 | 0 |
| ధనియాలు 90 సేరులు | | 14 | 0 | 0 |
| ఉలవలు | | 34 | 0 | 0 |
| అల్లాదాలు | | 51 | 0 | 0 |
| పంచదార (ఉయ్యూరు) | | 108 | 2 | 3 |
| కొబ్బరినూనె డబ్బా | | 34 | 8 | 0 |
| వెల్లుల్లి మణుగు | 6-4-0 | 7 | 0 | 0 |
| బెల్లం ,, | 8-4-0 | 5 | 4 | 0 |
| మిర్చి ,, | 12-0-0 | 17 | 0 | 0 |
| నీరుల్లి ,, | 8-4-0 | 4 | 0 | 0 |
| చింతపండు ,, | 8-4-0 | 4 | 12 | 0 |
| నువ్వులనూనె(మణుగున్నర) | | 84 | 0 | 0 |

## జనగాం

జనగామ తాలూకా నాయీ బ్రాహ్మణ సంఘ నిర్మాణానికిగాను పట్టణసంఘ కార్యకర్తలు ఈనెల 1 నుండి 18 వరకు పెంబర్తి అశ్వారావుపల్లి, ఖిలాషాపురం మొదలైన గ్రామాలలోకి వెళ్ళి అచ్చటచ్చటి గ్రామ సంఘాలను ఏర్పాటు చేశారు.

| | | | | |
|---|---|---|---|---|
| శెనగపప్పు 177 శే॥ | | | | |
| ,, జగ్గయ్యపేట | | 57 | 0 | 0 |
| ,, కోదాడు | | 58 | 0 | 0 |
| ,, నూనె మణుగు | | 16 | 8 | 0 |
| ,, కేక్ 160 శే॥ | | 16 | 2 | 0 |
| ,, మడ్డిపిండి 160 శే॥ | | 19 | 8 | 0 |
| కొబ్బరికాయలు 1000 పాత | | 175 | 0 | 0 |
| కొత్త | | 168 | 0 | 0 |
| పసుపు పుట్టి | 60/- | 80 | 0 | 0 |
| కొమ్మూర్ | | 105 | 0 | 0 |
| సంచులు 100 | | 119 | 0 | 0 |
| డిటో [illegible] | | 108 | 0 | 0 |

ఏజెంట్లు కావలెను

కమీషన్ పద్ధతిపై చేతి గడియారములు, టైమ్‌పీస్‌లు అమ్మకపు ఆర్డర్లు సేకరించుటకు ఏజెంట్లు కావలెను.

ఉచిత కేలండర్, కేటలాగులను అడగండి!

MORISON WATCH, Co.,
232, D. Naoroji Rd. Bombay-1

పక్షవాతములకు ప్రత్యేక చికిత్స

చంటిపిల్లల, పెద్దల, పక్ష, చచ్చు, తిమ్మిరి, సర్వాంగ వాతములు ఏ దశలో నున్నను చికిత్స చేయబడును.

పోలియో ఆస్పత్రి,
పున్నమ్మతోట - విజయవాడ-2



శులేఖా పెన్
సంతృప్తి నిచ్చును

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
పెన్‌మెన్స్‌ఇండస్ట్రియల్
సర్వీ పెన్,
కాండివ్లి, బొంబాయి-3, యస్. డి.
లోకల్ సేల్సు:
10, షామ్‌సేట్‌వీధి, బొంబాయి - 2

## టెండరు నోటీసు

గుంటూరు జిల్లా పల్నాడుతాలూకా నడికూడె పంచాయితీ బోర్డు తాలూకు దిగువ సుదహరించిన పనులను ది. 31-12-57 లోపల పూర్తి చేయుటకుగాను, 14-10-57 సాయంత్రం గం. 4-0 ల లోపల ఆఫీసు పని చేయువేళలందు పంచాయితీ కార్యనిర్వహణాధికారికి ఎస్టిమేటు మొత్తంపై రు. 100 కి రు. 5/-ల చొ॥న డిపాజిట్టు కట్టినమీదట టెండర్లు తీసికోబడును. ఆ రోజునకే సాయంత్రము నాలుగున్నర గంటలకు టెండర్లు తెరవబడును. ఈ సందర్భములో అవసరమగు తదితర సమాచారములను పంచాయితీ ఆఫీసులో ఆఫీసుపని వేళలందు తెలుసుకొనవచ్చును.

| | నడికూడె గ్రామంలో మెటల్ రోడ్లువేయుట | ఎస్టిమేటు మొత్తం |
|---|---|---|
| 1. | పబ్లిక్ చావడివద్దనుండి పీర్ల చావడి వరకు | రు. 675 |
| 2. | సాధినేని అంజయ్య యింటివద్ద నుండి అక్కినపల్లి హనుమయ్య యింటి వరకు | రు. 180 |
| 3. | పబ్లిక్ చావడివద్ద నుండి కొరిమెళ్ళ చిన రామయ్య యింటి వరకు | రు. 260 |
| 4. | జువ్వల సంగమ్మ యింటివద్ద నుండి బోర్డు ఎలిమెంటరీ స్కూలు వరకు | రు. 720 |
| 5. | బండ్లదొడ్డివద్ద నుండి గుంటూరు - గురజాల రోడ్డు వరకు | రు. 850 |
| | ఇరికేపల్లి గ్రామంలో మెటల్ రోడ్లువేయుట | |
| 6. | మిషను స్కూలువద్ద నుండి మాదిగపాలెం ద్వారా హరిజనుల బావి వరకు | రు. 810 |
| 7. | మిషను స్కూలువద్ద నుండి మాలపాలెం ద్వారా హరిజనుల బావి వరకు | రు. 725 |
| 8. | కాళ్ళ నరసింహం యింటివద్ద నుండి పీర్ల చావడి వరకు | రు. 580 |
| 9. | పన్‌స్సూర్‌సాపేటలో బోర్డు ఎలిమెంటరీ స్కూలు నుండి షేకుపాలెం సైదులు యింటివరకు మెటలు రోడ్డు వేయుట. | రు. 600 |
| 10. | ట్రావెలర్సు బంగళానుండి రైల్వే స్టేషనుకు గల ఫీడరు రోడ్డు ఒకటి మరియు రెండు ఫర్లాంగులు రిపేరు చేయుట | రు. 1700 |
| 11. | ఇరికేపల్లి గ్రామంలో మంగమ్మ బావివద్ద నుండి యీదా అప్పిరెడ్డి దొడ్డివరకు కాపరాళ్ళ పరపుతో రోడ్డువేయుట. | రు. 1140 |
| 12. | నడికూడె రైల్వేస్టేషను సమీపములో ఒక బావిని త్రవ్వుట. | రు. 800 |
| 13. | ఇరికేపల్లి గ్రామంలో మాలపాలెంలో బావిని త్రవ్వుట | రు. 800 |

నడికూడె,
ది 30-9-57

గోళ్ళ మంగయ్య
అధ్యక్షులు.

# పశ్చిమ బెంగాల్ బ్యాంకు ఉద్యోగులకు సానుభూతి

## పలుచోట్ల బైఠాయింపు సమ్మెలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30

ఢిల్లీ బ్యాంకు ఉద్యోగులలో నూటికి 40 మంది పశ్చిమబెంగాల్ బ్యాంకు ఉద్యోగులకు సానుభూతి తెలుపుతూ నేడు రెండు గంటలసేపు సమ్మె చేశారు.

బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ అనుబంధ సంస్థలలో సభ్యులుగా వున్నవారందరూ సమ్మెలో పాల్గొన్నారు. రిజర్వుబ్యాంకు, ఇండియా స్టేట్ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొనలేదు.

ఢిల్లీలో మొత్తం 3,500 మంది బ్యాంకు ఉద్యోగులు ఉన్నారు.

## సెంట్రల్ బ్యాంకు స్టాఫ్ ఎసోసియేషన్ అధ్యక్షుని అక్రమ బదిలీ

విజయవాడ, సెప్టెంబరు 30

గుంటూరు బ్రాంచిలో పనిచేస్తున్న సెంట్రల్ బ్యాంకు స్టాఫ్ ఎసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ పి. రామసుబ్బారావుగారిని ఈ రోజు సాయంత్రం ఆకస్మికంగా హైదరాబాద్ బదిలీచేస్తూ బ్యాంకు ఏజంటు ఉత్తర్వులు జారీచేశారు. యూనియన్ అధ్యక్షుణ్ణి కాని కార్యదర్శిని కాని, బదిలీ చేయాలంటే కనీస వ్యవధి కొన్ని రోజులు యివ్వాలనీ, నోటీసు బోర్డులో ప్రకటించాలనీ, అభ్యంతరాలను చెప్పడానికి అవకాశం యివ్వాలనీ బ్యాంకు ఎవార్డులో ఉన్నది. కాని ఈ నిబంధనలను పాటించకుండా కొన్ని గంటల వ్యవధి మాత్రమే యిచ్చారు. ఈ అక్రమ చర్యపై స్టాఫ్ ఎసోసియేషన్ కార్యదర్శి శ్రీ జె. వి. వి. కుంటురావుగారు ఒక ప్రకటన చేస్తూ యూనియన్‌ను బలహీన పరచాలనే ఉద్దేశ్యంతోనే ఈ అక్రమ బదిలీ చేశారని, అధికారుల చర్యను నిరసిస్తూ అన్ని బ్రాంచీలవారు వెంటనే తీర్మానాలుచేసి బొంబాయిలోని బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపాలని కోరారు.

## సమ్మెకు బీహార్ బ్యాంకు ఉద్యోగుల నిర్ణయం

పాట్నా, సెప్టెంబరు 30

తమ కోర్కెల సాధనకోసం సమ్మె చేయాలని బీహార్ బ్యాంకు ఉద్యోగుల సంఘ కార్యవర్గం నిన్న సమావేశమై నిశ్చయించింది.

సమ్మెను ప్రారంభించే తేదీని నిర్ణయించడానికీ, ఉద్యోగులకు అవసరమైన ఇతర సలహాలు యిచ్చేందుకూ అయిదుగురు సభ్యులతో ఒక కార్యాచరణ సంఘాన్ని ఎన్నుకొన్నారు.

## ఉమ్మడి రిజర్వు పోలీసు ప్రతిపాదన

### ఆర్థికదృష్ట్యా చేసినట్లు శ్రీ కామరాజ్ వివరణ

మద్రాసు, సెప్టెంబరు 30

దక్షిణ మండలానికి చెందిన రాష్ట్రాలన్నిటికి ఉమ్మడి రిజర్వు పోలీసు ప్రతిపాదన ముఖ్యంగా ఆర్థికదృష్ట్యా చేసినట్లు మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ నేడిక్కడ ఒక గోష్టిలో చెప్పారు. ఈ ప్రతిపాదన వెనుక ఏ ఉద్దేశమూ లేదన్నారు.

దక్షిణమండల సమితి స్థాయీ సమావేశంలో పాల్గొని శ్రీ కామరాజ్ నేటి మధ్యాహ్నం హైదరాబాద్ నుండి ఇక్కడికి వచ్చారు.

ఆంధ్రప్రదేశ్, మద్రాసు, కేరళ, మైసూరు రాష్ట్రాల పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్స్‌తో ఒక కమిటీని సమితి ఏర్పాటు చేసింది. మొత్తం ఈ ప్రాంతానికి ఉమ్మడి రిజర్వు పోలీసు బలగాన్ని ఏర్పాటు చేయడం గురించి వివరాలను పరిశీలిస్తారు. మండలసమితి వచ్చే సమావేశంనాటికి కమిటీ నివేదిక సిద్ధపడుతుంది.

సరిహద్దులపై తమకూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికీ మధ్య కుదిరిన ఒడంబడిక అమలులోకి వచ్చేందుకు అవసరమైన శాసనం త్వరలోనే చేయబడుతుందని శ్రీ కామరాజ్ చెప్పారు.

మైసూరుగవర్నర్ శ్రీ జయచామ రాజవడయార్‌తో ఆచార్య వినోబాభావే ఆదివారంనాడు 90 నిముషాల సేపు సంభాషణలు జరిపారు.

## విదేశీ బ్లేడ్ల దిగుమతి నిషేధం

### భారత ప్రభుత్వ విధాన ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30

1958 అక్టోబరు - మార్చి దిగుమతి విధానంలో భారతప్రభుత్వం విదేశీ బ్లేడ్ల దిగుమతిని పూర్తిగా నిషేధించింది.

విదేశీ బ్లేడ్ల వాడకానికి ఇంతవరకు అలవాటైనవారు ఇకమీదట స్వదేశీ బ్లేడ్లపై ఆధారపడవలసి వుంటుంది.

సాలీనా విదేశాల నుండి దిగుమతి చేసుకొనే బ్లేడ్ల విలువ 25 లక్షల రూపాయలు.

ప్రస్తుతం భారతదేశంలో ఉత్పత్తి అయిన బ్లేడ్లు దేశ అవసరాలకు సరిపోతాయని అంచనా వేయబడుతున్నది.

1958 అక్టోబరునుండి మార్చి వరకు ప్రభుత్వం దిగుమతుల విధానాన్ని ప్రకటించింది.

దీని ప్రకారం [illegible] తయారైన వస్తువులు, ఉన్ని గుడ్డలు, సైకిళ్ళు, చేతిగడియారాలు, ఫౌంటెన్ కలాలు, గాజుసామానులు, చాకులు దిగుమతి చేసుకోవడానికి లైసెన్సులు ఇవ్వబడతాయి. పాలపొడితో తయారైన పదార్థాలు సాధ్యమైనంత వరకు దిగుమతి చేసుకోవడానికి అనుమతిస్తారు.

మందుల దిగుమతి కోటా తగ్గించబడింది. దేశంలో పారిశ్రామిక ఉత్పత్తిని నిలబెట్టడం కోసం పారిశ్రామిక ముడి పదార్థాల దిగుమతికి అనుమతి ఇవ్వబడుతుంది.

డీజల్, పెట్రోల్, కిరోసిన్ ఇంజన్ల విడిభాగాలు, ఎలక్ట్రిక్ మోటార్లు, ఎలక్ట్రిక్ కేబుల్స్, విద్యుచ్ఛక్తి సహాయంతో నడిచేపంపులు, సైకిల్ యంత్రాలు, లైఫ్ బెల్టులు, మోటార్ల విడిభాగాలు దిగుమతి చేసుకోవడానికి అవకాశం కల్పించబడింది.

## చైనా పారిశ్రామిక అభివృద్ధి

### సొంతకాళ్ళపై నిలబడగల్గిన స్థితి చేరినదని వివరణ

పెకింగ్, సెప్టెంబరు 29

కొత్త పరిశ్రమల స్థాపనకు అవసరమైన యంత్రాలన్నిటినీ చైనాదేశం స్వయంగా ఉత్పత్తి చేసుకోగల్గిన స్థితికి ఈనాడు చేరిందని నవచైనా వార్తాసంస్థ ప్రకటించింది.

వర్తమాన పంచవర్ష ప్రణాళికలో దాదాపు 80 భారీయంత్ర నిర్మాణ కర్మాగారాలు నిర్మించబడుతున్నవనీ, వీటిలో సగానికిపైగా, నిర్మాణం పూర్తి కాకముందే, అప్పుడే ఉత్పత్తిని ప్రారంభించాయనీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చైనా జాతీయ ఆర్థిక వ్యవస్థను స్వశక్తితో పునర్నిర్మాణం చేసేందుకు అవసరమైన సాధనాలన్నీ ఇక సమకూర్చుకోగలదని అన్నారు.

లోహ కర్మాగారాలు, విద్యుత్ ఉత్పాదక యంత్రాలు, గని త్రవ్వకపు యంత్రాలు, యంత్ర పరికరాలు, సున్నితపు యంత్ర పరికరాలు, రైలు ఇంజన్లు, కారులు, విమానాలు, చిన్న చిన్న నావలు, పంచదార శుద్ధి యంత్రాలు, కాగితపు మిల్లులు, వ్యవసాయక యంత్రాలు మున్నగువాటిని ఉత్పత్తిచేసే యంత్రాలను యిప్పుడు చైనాలోనే తయారు చేస్తున్నారు.

## హైదరాబాదులో అచ్యుతమీనన్

హైదరాబాద్, సెప్టెంబరు 30

కేరళ ఆర్థికమంత్రి శ్రీ అచ్యుతమీనన్ ఇక్కడి ప్రాగాటూల్స్, ఆర్.టి.డి. వర్క్‌షాపు, పి.డబ్ల్యు.డి. వర్క్‌షాపు మున్నగు పారిశ్రామిక కేంద్రాలను సందర్శించారు. కేరళలో పరిశ్రమలను నెలకొల్పే సమస్యను గురించి ఆయన ఇక్కడ కొందరు పారిశ్రామిక వేత్తలతో ఇష్టాగోష్టిగా సంప్రతించినట్లు కూడా తెలుస్తోంది.

శ్రీ అచ్యుతమీనన్ నేటి మధ్యాహ్నం ఇక్కడనుంచి బయలుదేరి బెంగుళూరు వెళ్ళారు. (వి. వి)

# ప్రభుత్వానికి ఆంధ్ర మిల్లర్ల వాగ్దానం

## అక్టోబరులో 40 వేలటన్నుల బియ్యం సప్లయి చేస్తామని

హైదరాబాద్, సెప్టెంబరు 30

ఆంధ్ర మిల్లర్లు అక్టోబరు మాసంలో మామూలు నాణ్యం కలిగిన ముతక బియ్యం, పచ్చిబియ్యం, ఉప్పుడుబియ్యం నలభైవేల టన్నులదాకా స్వచ్ఛందంగా ప్రభుత్వానికి సప్లయి చేయడానికి అంగీకరించినట్లు కేంద్ర ఆహార వ్యవసాయమంత్రి శ్రీ జైన్ నేడిక్కడ పత్రికా విలేఖరులతో చెప్పారు.

కంట్రోలు ధరలకే ఈ బియ్యం సప్లయి చేయబడుతుంది. ధర మణుగు రు 17 లనుండి రు 18½ ల వరకు వుంటుంది.

మిల్లర్లు తాము చెప్పిన ప్రకారం అక్టోబరు నెలలో నలభైవేల టన్నుల బియ్యం ప్రభుత్వానికి సప్లయిచేస్తే, బెంగాల్, బొంబాయి రాష్ట్రాలకు ఇరవైవేల టన్నుల సన్నరకం బియ్యం ఎగుమతి చేసుకోవడానికి అనుమతి ఇవ్వబడుతుందని శ్రీ జైన్ చెప్పారు.

వారు ప్రభుత్వానికి సప్లయి చేసిన ప్రతి రెండు టన్నుల బియ్యానికి ఒక టన్ను చొప్పున ఎగుమతి చేసుకోవడానికి అక్టోబరు రెండవ వారంలో అవకాశం కల్పిస్తామన్నారు. అక్టోబరు మొదటివారంలో మొత్తం సప్లయి పదివేల టన్నులకు తగ్గితే, ఆ తగ్గినమేరకు ఎగుమతి కోటా తగ్గించబడుతుందన్నారు.

మద్రాసు, మైసూరు రాష్ట్రాలలో చౌకడిపోల సంఖ్య చాలవరకు తగ్గించబడిందని శ్రీ జైన్ చెప్పారు. దక్షిణ ప్రాంతం మొత్తంమీద బియ్యంలో మిగులుగా వుంటుందనే ఉద్దేశ్యంతో ఆంధ్ర, మద్రాసు, మైసూరు, కేరళ రాష్ట్రాలను కలిపి, దక్షిణ బియ్యం మండలం ఏర్పాటు చేశాం. అప్పట్లో కొంతకాలం తర్వాత చౌకడిపోలు క్రమంగా తీసివెయ్యాలని నిశ్చయించాం.

దక్షిణమండలం ఏర్పరచిన తర్వాత మద్రాసు, మైసూరు రాష్ట్రాలలో పప్పులు కాయధాన్యాల ధరలుకూడా తగ్గిపోయాయి. కాగా, ఆంధ్రనుంచి బియ్యం సరఫరా కానందున, బొంబాయి, బెంగాల్ రాష్ట్రాలలో ఆహార పరిస్థితి క్లిష్టమైంది. కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రాలలో విస్తారంగా నిల్వలు విడుదల చెయ్యవలసి వచ్చింది. అక్టోబరు నుంచి మద్రాసు, మైసూరు రాష్ట్రాలలో చౌకడిపోల ద్వారా అమ్మకానికి బియ్యం సప్లయి చేయరాదని నిశ్చయించాం. అయితే చౌకడిపోలను ఒకేసారి మూసివేయడం కష్టం కాబట్టి, కేంద్రం ఈ రాష్ట్రాలకు బియ్యం అప్పుగా ఇస్తుంది. పంటలు వచ్చినతర్వాత అప్పు వసూలుచేస్తుంది.

ఆగస్టు 1 సెప్టెంబరు 15 తేదీల మధ్య, మద్రాసు, మైసూరు రాష్ట్రాలలో ఆహారధాన్యాల ధరలు బాగా తగ్గిపోయాయి. ఇది సామాన్యంగా ధరలు పెరిగేకాలం. ఇపుడు ధరలు తగ్గడం సంతోషదాయకం.

శ్రీ జైన్ ఇంకా ఇలా చెప్పారు: దక్షిణ బియ్యం మండలం ఏర్పాటు చెయ్యడమంటే, ముందు దక్షిణ రాష్ట్రాలకు ఆహారం అందివ్వాలని, ఆ తర్వాత మిగులును బయటికి ఎగుమతి చేయాలని భావించామన్నమాట.

దక్షిణాన ఆహార క్లిష్టత ప్రారంభమైనప్పటినుంచీ, కేంద్ర ప్రభుత్వం ఆంధ్రలో 20 వేల టన్నుల బియ్యం సేకరించింది. కేరళ ప్రభుత్వం 5 వేల టన్నులు కొనుగోలు చేసింది. బహిరంగ మార్కెట్టులో 13 వేల టన్నులు అమ్మకమైంది.

జూన్‌కి ముందు మూడు మాసాలలోవున్న సగటు ధరలకు కేంద్ర ప్రభుత్వం 5 వేల టన్నులు కొన్నది. మిగతా కంట్రోలు ధరలకు కొన్నది. కంట్రోలు ధర, సగటుధరకంటె తక్కువ.

మిల్లర్లవద్ద ఇపుడు 45 వేల టన్నుల బియ్యం, వడ్లు వున్నవి. వారు స్టాక్కులవద్దనుంచికొని, అక్టోబరులో 40 వేల టన్నుల బియ్యం ప్రభుత్వానికి సప్లయిచేయడానికి అంగీకరించారు. అప్పుడు వారికి, బెంగాల్, బొంబాయి రాష్ట్రాలకు 20 వేల టన్నుల బియ్యం ఎగుమతి చేయడానికి పర్మిట్ ఇవ్వబడుతుంది.

## కృష్ణమీనన్ ప్రసంగం

(1వ పేజీ తరువాయి)

భావించకూడదు. ఇక పరిష్కార విషయం తీసుకున్నట్లయితే, ఏదేశమూ తన సర్వాధికారంపై పరిష్కారం తీర్పును అంగీకరించదు. కాశ్మీర్‌పై దురాక్రమణ జరిగింది. భద్రతాసమితి ఉత్తర్వులు జారీచేయడానికి సిద్ధంగా లేదు. భద్రతాసమితికి మేము పాకిస్తాన్‌పై ఫిర్యాదు చేసినపుడు, పాకిస్తాన్ తాను అసలు దాడి చెయ్యనే లేదన్నది. ఆ విధంగా భద్రతాసమితిని మోసంచేసింది.

ప్రశ్న: తొమ్మిదేళ్ళక్రితం, ప్లెబిసైట్‌కు దారితీసే ప్రతిపాదనలు మీరు అంగీకరించారు కాదా?

జవాబు: తొమ్మిదేళ్ళ క్రితం మేము రక్తపాతాన్ని ఆపాలని చాలా ఆతురత చెందాం. పాకిస్తాన్ తన సైన్యాన్ని ఉపసంహరించితే, శత్రు ప్రచారాన్ని ఆపివేస్తే కొన్ని పనులు చేయవచ్చునన్నాం.

ప్రశ్న: ఏమి పనులు జరిగివుండేవి?

జవాబు: ఇంకా మరికొన్ని సేనలను ఉపసంహరించడం జరిగివుండేది. మా సేనలను అక్కడ పరిమితంగా వుంచేవారం. ఆ తర్వాత, ఇక ఏమి చెయ్యాలో కమిషన్‌తో చర్చించి వుంచేవారం. కాని ఇది సాధ్యం కానందున మాకు తోచిన చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: ఇపుడు పాకిస్తాన్ తన సైన్యాలను ఉపసంహరించితే, —

జవాబు: అయితే గియితే అనే ప్రాతిపదికపై ఈ విషయాలు చర్చించజాలం. ఇక్కడ నిల్చుని ఏమైనా మాట్లాడవచ్చు. కాని మేము మా పరిస్థితి విషయం చూచుకోవాలి.

ప్రశ్న: జారింగ్ నివేదిక సంగతేమిటి?

జవాబు: భారతదేశంఒక్క వాగ్దానాన్ని ఉల్లంఘించిన ఉదంతంకూడా లేదు. అసలు ఇదివరలో మేముచెప్పిన విషయాలకు పొల్లుపోకుండా అంటిపెట్టుకొని వుండడమే మాకుచిక్కులు తెచ్చిపెడుతోంది.

లీగల్ సమస్యనుగాని, రాజకీయ సమస్యనుగాని నిర్ణయించే హక్కు ఐరాస ప్రణాళిక ప్రకారం భద్రతాసమితికిలేదు. మా దేశంనుంచి దురాక్రమణదారుని తొలగించవలసిన బాధ్యత భద్రతాసమితిపై వుంది. ఈజిప్టుపై ఇజ్రాయిల్, బ్రిటన్, ఫ్రాన్సులు దాడిచేసినపుడు ఏ పరిస్థితి వుందో, కాశ్మీర్‌లో ఇపుడు అదే పరిస్థితివుంది.

ప్రశ్న: కాశ్మీర్‌నుంచి పాకిస్తాన్ సైన్యాలను తొలగించడంలో మీరు ఐరాస సహాయాన్ని కోరుతున్నారు కదా?

జవాబు: అవును. ఇందుకోసం ఐరాస యుద్ధం చేయాలని మేము కోరలేదు. వారు ప్రణాళికలో 6వ అధ్యాయం క్రింద, ఏ పక్షానిది తప్పు చెప్పాలని కోరాం.

ప్రశ్న: పాక్ సైనికులను తొలగిస్తే కాశ్మీర్‌లో ప్లెబిసైట్ జరుగుతుందా?

జవాబు: ఇలాంటిఅయితే గియితే ప్రశ్నలకు సమాధానం చెప్పి, మేము చిక్కుల్లో పడ్డాం. అయినా సమాధానం చెబుతాను.

ఇది ఏదో కొద్దిమంది పాక్ సైనికులను ఉపసంహరించే సమస్యకాదు. వారు అక్రమంగా ఆక్రమించిన ప్రాంతంలో 30 వేల మంది సాధారణ సైనికులు, గెరిల్లాలు వున్నారు. ఇది ఐరాస తీర్మానాలకు వ్యతిరేకం. ఇవంతా తొలగిపోయి, ఐరాస తీర్మానాలను మనం చర్చించడం ప్రారంభించినప్పుడే పాక్ సైనికుల ఉపసంహరణ పూర్తిగా జరిగినట్లు భావించుకోగలం.

భద్రతాసమితి మళ్ళీ అక్టోబరు 8వ తేదీన సమావేశమై కాశ్మీర్ సమస్యను చర్చించవచ్చునని అభిజ్ఞవర్గాలవారు నేటిరాత్రి చెప్పారు. అయితే ఈ తేదీకూడా ఖచ్చితంగా నిర్ణయం కాలేదు. శ్రీ కృష్ణమీనన్ ఆనాడు భారతదేశం తరపున ప్రసంగిస్తారు.

# సోషలిస్టు సమాజ స్థాపనకు ప్రజాసమీకరణ

## కాంగ్రెసు కార్యకర్తల కర్తవ్యంపై కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఢేబర్ వివరణ

### కేరళలో పరిస్థితి గురించి ప్రస్తావన

హైదరాబాద్, సెప్టెంబరు 30

భారతదేశంలో సోషలిస్టు సమాజస్థాపనకు కాంగ్రెసు కార్యకర్తలు నడుంబిగించి, ప్రజలను సమీకరించాలని కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఢేబర్ నేడిక్కడ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కార్యకర్తల సభలో ప్రసంగిస్తూ ఉద్బోధించారు.

కాంగ్రెసు కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్ళి, కాంగ్రెస్ ఆశయాలను వివరించి చెప్పాలనీ, లేకపోతే, ప్రజలలో కాంగ్రెసు పలుకుబడి పూర్తిగా సన్నగిల్లిపోయే ప్రమాదం వుందని ఆయన హెచ్చరించారు.

గత ఎన్నికలలో కాంగ్రెసు కొన్ని చోట్ల పరాజయం పొందిందంటే, ఆ ప్రాంతాలలోని కాంగ్రెసువారు ప్రజలతో నిత్యసంబంధాలు పెట్టుకోకపోవటమే అందుకు ప్రధాన కారణమని ఆయన వివరించారు.

అయితే అంతమాత్రాన కాంగ్రెసువారు నిస్పృహ చెందవలసిన పనిలేదు. ప్రజలతో సంబంధాలు సన్నగిల్లిపోతే, ప్రజలలో కాంగ్రెసుపలుకుబడి ఎగిరిపోయే ప్రమాదం వుందన్న గుణపాఠాన్ని ఎన్నికల అపజయాల నుంచి కాంగ్రెసువారు గ్రహించాలని ఆయన హెచ్చరించారు.

### కేరళ పరిస్థితి

కేరళ పరిస్థితిని ప్రస్తావించి శ్రీ ఢేబర్ ఇలా చెప్పారు:

"కేరళలో కమ్యూనిస్టులు అధికారానికి రాకపూర్వం సమ్మెలగురించిన వార్త వినని రోజు లేదు. కాని అక్కడ కమ్యూనిస్టుప్రభుత్వం ఏర్పడినతర్వాత సమ్మెల వార్తలు విన్పించటమే లేదు. పైగా, ప్రజాప్రభుత్వం ఏర్పడిందని అంతా చెప్పుకుంటున్నారు. సమ్మెలు చేయటం మంచిదికాదనీ, ఉత్పత్తి పెంచాలనీ ముచ్చటైన మాటలు పెద్దగా విన్పిస్తున్నాయి. అలాంటి వాతావరణాన్నే మిగతా రాష్ట్రాలలో కాంగ్రెసు వారు సృష్టించాలని శ్రీ ఢేబర్ చెప్పారు.

సోషలిస్టు సమాజ స్థాపనకు కాంగ్రెసు కార్యకర్తలు ప్రజలను సమీకరించాలనీ, ప్రజా సహకారం పొందాలనీ ఆయన అన్నారు.

## చైనా జాతీయ దినోత్సవం

### భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి అభినందనలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30

చైనా జాతీయ దినోత్సవ సందర్భములో చైనా ప్రజా రిపబ్లిక్ అధ్యక్షునికి, చైనా ప్రధానికి భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి వేరువేరుగా సందేశాలు పంపించారు.

"భారత, చైనాలమధ్య ఇప్పుడు నెలకొన్న స్నేహ సంబంధాలు భవిష్యత్తులో ఇంకా పదిలంకావాలని" భారత రాష్ట్రపతి చైనా ప్రజా రిపబ్లిక్ అధ్యక్షునికి పంపిన సందేశంలో ఆకాంక్ష వెలిబుచ్చారు.

భారత ప్రధాని చైనా ప్రధానికి పంపిన సందేశంలో ఇలా వుంది:

"మన ఉభయదేశాల మధ్య ఏర్పడిన సత్సంబంధాలు గత సంవత్సరం మీరు భారతదేశానికి రావడంవల్ల బలపడ్డాయి. ఉభయదేశాల శ్రేయస్సు దృష్ట్యా, ప్రపంచ శాంతిదృష్ట్యా ఈ సంబంధాలు మరింత బలపడాలని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను."

## కేంద్రం సూచనలు పాటిస్తున్న తొలి రాష్ట్ర ప్రభుత్వం

### కేరళ విద్యామంత్రి ప్రసంగం

చెరుప్పు, సెప్టెంబరు 30

సమగ్రమైన వ్యవసాయ సంస్కరణలను మొట్టమొదటగా అమలుజరుపుతున్నది కేరళ ప్రభుత్వమేనని రాష్ట్ర విద్యామంత్రి శ్రీ ముండస్సేరి నిన్నరాత్రి ఇక్కడ రైతుసంఘం ఆధ్వర్యాన జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తూ చెప్పారు. ఈ సభకు అనేక వేలమంది ప్రజలు హాజరయ్యారు. [ఈ వార్తను సంగ్రహంగా నిన్ననే ప్రకటించాం —సం.]

సమగ్రమైన వ్యవసాయ సంస్కరణలను అమలుజరుపుమని గత కొలది సంవత్సరాలుగా ప్రణాళికాసంఘం దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను పదే పదే కోరుతూ వచ్చింది. అయినా ఏ ఒక్క రాష్ట్రప్రభుత్వం కూడా, సంపూర్ణమైన భూసంస్కరణలను అమలుజరపటానికి పూనుకోలేదు. కొద్ది మాసాల క్రితమే ఏర్పడిన కేరళ ప్రభుత్వం అప్పుడే భూసంస్కరణల ముసాయిదా బిల్లును తయారుచేసి, కేంద్రప్రభుత్వ పరిశీలనకు పంపించిందని ఆయన చెప్పారు.

కేరళరాష్ట్రాన్ని పారిశ్రామికవంతం కావించి, నిరుద్యోగ సమస్యను సాధ్యమైనంతవరకు నిర్మూలించటానికి తమ ప్రభుత్వం దీక్షతో పనిచేస్తున్నదని శ్రీ ముండస్సేరి వివరించారు. కార్మిక, కర్షకుల జీవితం బాగుపరచేందుకు అవసరమైన ప్రాతిపదికనుమాత్రమే ఇప్పటికి సమకూర్చగలిగామన్నారు.

## తేవార్ అరెస్టుకు నిరసన

మదుర, సెప్టెంబరు 29

శ్రీ ముత్తురామలింగ తేవార్‌ను అరెస్టుచేసినందుకు నిరసన తెల్పుతూ కాంగ్రెసు సంస్కరణలసంఘం సదస్సులో నేడు తీర్మానించారు. రామనాథపురం జిల్లాలో శాంతిస్థాపనకు శ్రీ తేవార్ ఎంతో ప్రయత్నించేవారనీ, అలాంటి వారిని అరెస్టుచేయడం శోచనీయమనీ ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

భారతదేశం కామన్వెల్తు నుంచి వైదొలగాలని మరొక తీర్మానం చేశారు.

## 'ఫ్లూ' వ్యాధికి ఔషధం

లండన్, సెప్టెంబరు 29

రష్యాలో ఏడు సంవత్సరాల పరిశోధన ఫలితంగా ఇన్‌ఫ్లూయంజా నిరోధానికి "[illegible]" కొత్త ఔషధాన్ని కనుగొన్నట్లు మాస్కో రేడియో నేడు ప్రకటించింది.

ఈ మందు ఇన్‌ఫ్లూయంజా క్రిములను నాశనం చేస్తుంది. దీన్ని సరైన సమయంలో వాడితే పిన్నలకు, పెద్దలకుకూడా అతిత్వరలో వ్యాధి నయమౌతుంది. ఇది మాత్ర రూపంలో వుంటుంది. దీన్ని వాడినందువల్ల ఇతర విధాలైన విపరీతాలేవీ కలగవు.

## విదేశాలకు మన పంచదార ఎగుమతి

### ప్రపంచ యుద్ధానంతరం మొదటిసారిగా లక్షటన్నులు

పాట్నా, సెప్టెంబరు 30

ద్వితీయ ప్రపంచయుద్ధం అనంతరం మొట్టమొదటిసారిగా ఒక లక్ష టన్నుల పంచదారను భారతదేశం విదేశాలకు ఎగుమతిచేసింది.

బొంబాయి ఓడరేవు నుండి 74 వేల టన్నులు, కలకత్తా ఓడరేవు నుండి 31 వేల టన్నులు గత ఆరు మాసాల్లో బ్రిటన్, చైనా, మలయా, సింగపూర్, ఏడెన్, తూర్పు ఆఫ్రికా, పశ్చిమ ఆసియా దేశాలకు ఎగుమతి అయ్యాయి.

కేంద్ర ప్రభుత్వం ఈ యేడాదిలో రెండు లక్షల టన్నుల పంచదారను ఎగుమతి చేయడానికి అనుమతి నిచ్చింది.

భారతీయ పంచదార పరిశ్రమకు ప్రపంచంలో ద్వితీయ స్థానం వుంది. మనదేశంలో ఉత్పత్తి అయ్యే పంచదారలో నూటికి 60 వంతులు బీహార్, ఉత్తరప్రదేశ్ లలోనే తయారవుతుంది.

# బ్రిటన్‌లో గత 40 ఏళ్ళలో ఎరగని ఆర్థిక దుస్థితి

## కన్సర్వేటివ్ ప్రభుత్వ విధానాలవల్ల ఏర్పడిందని లేబర్‌పార్టీ మహాసభలో విమర్శ

బ్రైటన్, సెప్టెంబరు 30

బ్రిటిష్ లేబర్‌పార్టీ వార్షిక మహాసభ నేడిక్కడ ప్రారంభమైనపుడు, కన్సర్వేటివ్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై లేబర్ నాయకులు నిశితమైన విమర్శలు చేశారు. బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ మాక్మిలన్, బ్రిటన్‌ను అమెరికా, జర్మనీలకు పణంగా పెట్టాడని వారన్నారు.

బ్యాంకురేటును హెచ్చించడానికి దారితీసిన ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ఏకగ్రీవంగా ఒక అత్యవసర తీర్మానాన్ని ఆమోదించారు.

మహాసభకు 1500 మంది ప్రతినిధులు హాజరైనారు.

పార్టీ అధ్యక్షురాలు మిస్ మార్గరెట్ హార్బిసన్ మాట్లాడుతూ, వెంటనే జనరల్ ఎన్నికలు జరపాలని కోరారు. ప్రభుత్వం బ్యాంకు రేటును హెచ్చించడం వల్ల ఆర్థికంగా విషమస్థితి ఏర్పడిందని, నిరుద్యోగం ప్రబలుతుందనే ఆందోళన వ్యాపించిందని ఆమె అన్నారు.

ప్రపంచంలో డాలర్ కొరత ఏర్పడిందని సూచిస్తూ ఆమె ఇలా అన్నారు:

"అమెరికాలో మన మిత్రులు స్వతంత్రమైన, శక్తివంతమైన ప్రపంచాన్ని కోరుకున్నట్లయితే, ఎగుమతి, దిగుమతుల రంగంలో తమ చర్యల ఫలితాలనుగురించి వారు ఆలోచించుకోవాలి. మా శ్రమ ఫలితాలపై ఆధారపడి మేము జీవించదలిచాం. అమెరికా తన దిగుమతులను పెంచుకోవడంద్వారా ఇందుకు తోడ్పడగలదు".

ప్రభుత్వం కంట్రోళ్ళను విసర్జించటంవల్ల ధరలు పెరిగాయని, ద్రవ్యోల్బణం ఏర్పడిందని, ఆర్థిక తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ హెరాల్డ్ విల్సన్ ఇలా అన్నారు:

"గత 40 సంవత్సరాలుగా మన దేశంలో ఇంత ఆర్థిక దుస్థితి ఎన్నడూ ఏర్పడలేదు. మాక్మిలన్ ప్రభుత్వం కావాలని ఉత్పత్తిని తగ్గించివేసింది. అమెరికా, జర్మనీలకు మనదేశాన్ని పణంగా పెట్టింది."

ప్రభుత్వ పెట్టుబడిపైన, స్థానిక సంస్థలపైన, ట్రేడ్ యూనియన్ ఉద్యమంపైన, ప్రభుత్వ విధానాలు పనిగట్టుకొని దాడి చేస్తున్నవని ఆయన అన్నారు.

"మాక్మిలన్‌కి మేము చెప్పేది ఇదే-వైదొలగండి. ఊగిసలాటలకు మారుగా ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకొని, సాంఘిక న్యాయాన్ని, ప్రజలందరికీ సంక్షేమాన్ని సమకూర్చే ప్రభుత్వానికి స్థానం కల్పించండి."

ట్రాన్సుపోర్టు జనరల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఫ్రాంక్ కజిన్స్ ఈ తీర్మానాన్ని బలపరిచారు. ఆర్థిక ఇబ్బందులకు కార్మిక సంఘాలు కారణమంటూ ప్రభుత్వం ఆరోపిస్తోందన్నారు. నిరుద్యోగాన్ని సాకుగా తీసుకొని, కార్మిక సంఘాలను విచ్ఛిన్నంచేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

## కేరళ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్

### డాక్టర్ జాన్ మత్తయ్

త్రివేండ్రం, సెప్టెంబరు 30

కేరళ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ పదవిని స్వీకరించటానికి కేంద్ర మాజీ ఆర్థికమంత్రి డాక్టర్ జాన్ మత్తయ్ అంగీకరించినట్లు నేడిక్కడ అధికారికంగా తెలుస్తోంది.

## మన విద్యావిధానం

### రాష్ట్రపతి అభిభాషణ

బరోడా, సెప్టెంబరు 30

భారతదేశ సంప్రదాయాలకు అనుగుణ్యమైన ఒకేరకమైన విద్యావిధానాన్ని రూపొందించుకోవలసిన అవసరం గలదని రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ నేడిక్కడన్నారు.

రాష్ట్రపతి ఆర్యకన్యా మహావిద్యాలయం రజతోత్సవాలు జరుపుకొంటున్న సందర్భంలో ప్రసంగించారు.

మన దేశంలోని నేటి స్కూళ్లూ, యూనివర్సిటీలూ మన దేశానికి తగిన విద్యావిధానాన్ని రూపొందించలేకపోయాయని ఆయనన్నారు.

అసాధ్య రోగ చికిత్సలు
వైద్యులకు పుస్తకము ఉచితం
యోగి మెడికల్ హాల్
రాఘవయ్య పార్కు దగ్గర-విజయవాడ. 2

యమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి విక్రయసంఘం, లిమిటెడ్,
నం. వై. 298 యమ్మిగనూరు,
కర్నూలు జిల్లా
భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన చేనేత సొసైటి

జాతి పిత బాపూజీ జయంతి దినమగు నేడు అక్టోబరు 2వ తేది (2-10-57) న మా ద్వితీయ విక్రయశాలను గుంటూరు మునిసిపల్‌వారిచే నిర్మింపబడిన నూతన భవనమగు "బ్రహ్మానంద బిల్డింగ్సు" నందు తెరువబడునని తెలుపుటకు ఎంతయో సంతసించుచున్నాము.

కాన తామెల్లరు దయయుంచి, మా విక్రయశాలకు విచ్చేసి, తమకు కావలసిన పలురకములగు గుడ్డలను కొని పవిత్రమగు చేనేత గృహపరిశ్రమను ప్రోత్సహింపవలయునని కోరుచున్నాము.

సరసమైన ధరలకు పలురకముల నాణ్యమైన చేనేత వస్త్రములు ఇచ్చట దొరుకును.

ఇట్లు,
యమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి
విక్రయ సంఘము, లిమిటెడ్-నం. వై. 298.

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షుడు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి ఎడిటర్ ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆంధ్ర ప్రింటర్సు, విజయవాడ-2.